TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 195 | ఎడిటర్ : ఎం. రమేష్ | ఆదివారం, జూన్ 16, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-

## పార్టీ కోసం కష్టపడ్డవారికి నామినేటెడ్ పదవులు

- త్వరలోనే భర్తీ చేస్తామన్న సిఎం చంద్రబాబు
- పార్టీ శ్రేణులతో టెలి కాన్ఫరెన్స్‌లో స్పష్టీకరణ

**అమరావతి,జూన్15(పీపుల్స్ మోటివేషన్):**

పార్టీ కోసం కష్టపడిన వారి కోసం త్వరలోనే నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తానని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఆయన మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, బూత్‌స్థాయి కార్యకర్తలు ఇందులో పాల్గొన్నారు. కింది స్థాయి నుంచి ఎవరు ఎక్కడ పార్టీ కోసం పని చేశారో వారికే పదవులు దక్కేలా అధ్యయనం ప్రారంభించామని ఈ సందర్భంగా చంద్రబాబు స్పష్టం చేశారు. నేతలు, కార్యకర్తలు సాధికారత సాధిస్తే పార్టీ పునాదులు బలంగా ఉంటాయని పేర్కొన్నారు. అన్న క్యాంటీన్లు ఎక్కడెక్కడ మూతపడ్డాయో వాటిని వందరోజుల్లోనే తెరిపించే కార్యక్రమం ఉంటుందన్నారు. గత 20 ఏళ్లలో ఎన్నడూ గెలవని సీట్లలో కూడా ప్రజలు తెదేపాకి అధికారాన్ని కట్టబెట్టారంటే అది వారు పెట్టుకున్న నమ్మకమని చెప్పారు. కూటమికి 93 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతానికిపైగా ఓట్లు వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కూటమిలోని మూడు పార్టీల పాత్ర ఎంతో కీలకంగా పనిచేసిందన్నారు. ఈ ఘన విజయానికి కారణమైన కార్యకర్తల రుణం తప్పకుండా తీర్చుకుంటానని చంద్రబాబు స్పష్టం చేశారు. ఐదేళ్ల పాటు కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. అధికారం ఉందని కక్ష సాధింపులు, ప్రజా వ్యతిరేక పనులు చేయవద్దని సూచించారు. ఎమ్మెల్యేలు, నేతలు.. కింది స్థాయి కార్యకర్తలను విస్మరించకూడదన్నారు. బాధ్యతగా, చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రజలు మళ్లీ ఆదరిస్తారని దిశానిర్దేశర చేశారు.



## చట్టబద్ధంగానే విద్యుత్ కొనుగోళ్లు



- తెలంగాణలో నిరంతర విద్యుత్ కోసం కృషి
- ఈఆర్‌సి నిబంధనలు కాదని కమిషన్ వేయడం చట్టవిరుద్ధం
- మా ప్రభుత్వానికి దురుద్దేశాలు అంటకట్టే ప్రయత్నాలు సరికాదు
- కమిషన్ ముందుకు వచ్చి వివరణ ఇవ్వాల్సిన పనిలేదు
- వీలైతే మీరు రాజీనామా చేసి వెళ్లిపోండి
- జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్‌కు కేసీఆర్ లేఖ

6

## మంత్రి పవన్‌కు వదినమ్మ గిఫ్ట్

- ఖరీదైన మోంట్‌బ్లాక్ పెన్ను బహుమానం

**హైదరాబాద్,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అన్నయ్య చిరంజీవి కుటుంబాన్ని కలిసేందుకు పవన్ హైదరాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన వదినమ్మ సురేఖ అత్యంత ఖరీదైన మోంట్‌బ్లాంక్ పెన్నును బహుమతిగా ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోను చిరంజీవి తన సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకున్నారు. సురేఖ స్వయంగా పెన్నును తీసి, పవన్ జేబులో పెట్టగా అది చూసి పవన్ తెగ సంతోషపడ్డారు. అప్పటికే ఆయన వద్ద ఉన్న పెన్ను తీసి చూపించగా, 'ఇది కూడా అట్టిపెట్టుకో' అన్నట్లు సురేఖ చెప్పారు. ఆ వెంటనే ఒకవైపు నుంచి చిరంజీవి, మరోవైపు నుంచి పవన్ సతీమణి అన్నాలెజినోవా వచ్చి ఫొటో దిగారు. 'తెలుగు ప్రజల ఆకాంక్షల్ని నిజం చేస్తావని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ.. వదిన, అన్నయ్య' అంటూ చిరంజీవి వీడియోను ముగించారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతోంది. అత్యంత ఖరీదైన విలాసవంతమైన ఉత్పత్తులను మోంట్‌బ్లాంక్ అందిస్తుంది. లగ్జరీ పెన్నులు,



రీఫిల్స్, బ్యాగ్స్, లెదర్ వస్తువులు, వాచీలు, సెంట్స్ తదితర గిఫ్ట్‌లను తయారుచేస్తుంది. వీటి ఖరీదు కూడా అంతే ఎక్కువగా ఉంటుంది. సురేఖ.. పవన్‌కు ఇచ్చిన మోంట్ బ్లాంక్ డిస్నీ ఎడిషన్ పెన్నుల ధరల శ్రేణి రూ.90 వేల నుంచి రూ.2.60లక్షల వరకూ ఉంది.

## తెలంగాణలో భారీగా కలెక్టర్ల బదిలీలు

- పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం

6

## కేంద్రంలో ఉన్నది కిచిడీ ప్రభుత్వం

- అది ఎప్పుడైనా కూలిపోవచ్చు
- మరోమారు అక్కసు వెళ్లగక్కిన ఖర్గే

5



## సత్యదేవుడిని దర్శించుకున్న హోంమంత్రి అనిత

**అన్నవరం,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సత్య దేవుడిని దర్శించుకున్నారు శనివారం మధ్యాహ్నం హోం మంత్రి అనిత కుటుంబ సమేతంగా రత్నగిరి కొండపైకి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రికి దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనితకు వేద ఆశీస్సులు నిర్వహించి స్వామివారి జ్ఞాపికను అమ్మవారి పట్టు వస్త్రాలను ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు. ముందుగా స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ మంత్రి అనితను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో మండల, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## స్పందనకు సరికొత్త రూపం

- ప్రజా ఫిర్యాదలు పరిష్కార వేదికగా మార్పు
- ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత
- మంగళగిరి ప్రజల కోసం లోకేశ్ ప్రత్యేక ఏర్పాట్లు




6

## పోలీస్ అకాడమీలో అరుదైన దృశ్యం

ఐఎఎస్‌గా వచ్చిన కూతురికి తండ్రి సెల్యూట్

4



## కర్నూలు జిల్లాను స్మార్ట్ సిటిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం

- ఆంధ్రప్రదేశ్‌ను గుజరాత్ రాష్ట్రం తరహాలో పారిశ్రామికాభివృద్ధి చేస్తాం
- 21 రోజులలో సింగిల్ విండో క్లియరెన్స్‌కు చర్యలు తీసుకుంటాం
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం & ఆహారశుద్ధి శాఖ మంత్రివర్యులు టిజి భరత్



3

## జగన్ లోటస్‌పాండ్ ఇంటిముందు ఆక్రమణలు

- రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు కూల్చివేత

**హైదరాబాద్,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రేవంత్ సర్కార్ ఊహించని ఝలక్ ఇచ్చింది. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో జగన్ ఇంటి ముందు ఉన్న అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ కొరడా ఝులిపించింది. జగన్ ఇంటిముందు ఉన్న అక్రమ నిర్మాణాలను ఒక్కొక్కటిగా అధికారులు కూల్చివే స్తున్నారు. గతంలో జగన్ భద్రత కోసం రోడ్డును ఆక్రమించి మరీ గదులను సిబ్బంది నిర్మించడం జరిగింది. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు

(మిగతా 2వ పేజీలో..)



తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## జగన్ లోటస్‌పాండ్ ఇంటిముందు ఆక్రమణలు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టడంతో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగిస్తున్నారు. నివాసం ముందున్న అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. లోటస్ పాండ్ వద్ద అక్రమంగా నిర్మించిన పోలీస్ సెక్యూరిటీ షెడ్లను జీహెచ్ఎంసీ తొలగించింది. రహదారికి అడ్డుగా ఉన్నాయన్న ఫిర్యాదుతో జీహెచ్ఎంసీ అధికారులు మూడు షెడ్లను కూల్చేశారు. అక్రమ నిర్మాణాలు తొలగించాలని లోటస్ పాండ్ సిబ్బందికి జీహెచ్ఎంసీ, పోలీసులు నిన్ననే ఆదేశాలు జారీ చేశారు. రహదారి పక్కనే అక్రమ నిర్మాణాలతో రాకపోకలకు ఇబ్బంది మారిందని ఫిర్యాదు అందడంతో ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ అధికారులకు సామాన్య ప్రజలు, వాహనదారులు ఫిర్యాదులు చేశారు. ఈ వరుస ఫిర్యాదులో రంగంలోకి దిగిన అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. కాగా.. పోలీస్ బందోబస్తు మధ్య జగన్ ఇంటి ముందు నిర్మాణాలను అధికారులు కూల్చివేసారు.

## టిటిడి నుంచే పాలనా ప్రక్షాళన

- **ఇవోగా జె.శ్యామలరావు నియామకం**

**అమరావతి,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

ప్రక్షాళన దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. తిరుమల నుంచే దానికి శ్రీకారం చుట్టింది. ఇంతకాలం తితిదే ఇన్‌ఛార్జి ఈవోగా కొనసాగుతూ అనేక ఆరోపణలను ఎదుర్కొన్న ధర్మారెడ్డిని అక్కడి నుంచి పూర్తిగా తప్పించేసింది. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావును పూర్తిస్థాయి ఈవోగా నియమించింది. ముక్కుసూటిగా వ్యవహరించడంతోపాటు విధుల పట్ల చిత్తశుద్ధితో ఉంటారని, నిబద్ధతతో పనిచేస్తారని ఆయన గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఉన్నత విద్యాశాఖలో పనిచేస్తున్న శ్యామలరావును తితిదేకి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జీఎస్టీ అమల్లోకి వచ్చిన సమయంలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా ఉన్న శ్యామలరావు సాంకేతిక సమస్యలు రాకుండా చూసుకోవడంతోపాటు, రాష్ట్రానికి ఆదాయం పెరిగేలా పని చేసి గుర్తింపు పొందారు. అలాంటి చిత్తశుద్ధి ఉన్న అధికారి తిరుమలలో ఉంటే బాగుంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆయన్ను ఈవోగా నియమించిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 2022 మేలో తితిదే అప్పటి ఈవో జవహర్‌రెడ్డి బదిలీ కావడంతో అప్పట్లో అదనపు ఈవోగా ఉన్న ధర్మారెడ్డికి ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించింది ప్రభుత్వం. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఆ పోస్టులోకి ఎవరినీ రానివ్వకుండా ఆయనే కొనసాగుతూ వచ్చారు. కొత్త ప్రభుత్వం రాగానే ఆయన్ను ఈ నెల 11న సెలవుపై పంపింది. శుక్రవారం అక్కడి నుంచి పూర్తిగా రిలీవ్ చేసేసింది.

## కోడెలపై పెట్టిన కేసునే జగన్‌పైనా పెట్టాలి

- **తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరాం**

**అమరావతి,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

ప్రజాధనంతో ఏర్పాటు చేసిన ఫర్నిచర్‌ను సొంతానికి వినియోగించు కుంటున్న మాజీ సీఎం జగన్‌పై కేసు నమోదు చేయాలని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరాం ఓ ప్రకటనలో కోరారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ ఆరోజు ఫర్నిచర్ తన వద్ద ఉందని చెప్పకపోతే ఎవరికీ తెలియదు. ఫర్నిచర్ తీసుకెళ్లాలని స్పీకర్‌కు లేఖ రాసిన తర్వాత ఆయనపై కేసు పెట్టారు. అప్పటి నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఐపీసీ 409 సెక్షన్ కింద పదేళ్లు శిక్షపడే కేసు పెట్టారు. అదే జగన్ నేడు.. తాడేపల్లి, లోటస్‌పాండ్‌లో ఇళ్ల మరమ్మతుల కోసం రూ.18 కోట్లు ఖర్చు చేశారు. ప్రజలను కలవటానికి చంద్రబాబు ఏర్పాటు చేసిన ప్రజావేదిక కూల్చి వేశారు. ప్రస్తుతం జగన్ తన నివాసంలో సీఎంవో కింద తెచ్చిన ఫర్నిచర్ ఇచ్చేస్తానని కనీసం లేఖ రాయలేదు. ఇప్పటిదాక ఫర్నిచర్ ఇవ్వనందుకు కోడెలపై పెట్టిన కేసే జగన్ మీద పెట్టొచ్చు కదా!' అని ప్రకటనలో పేర్కొన్నారు.

## మధ్యప్రదేశ్‌లో విద్యార్థుల వికృత చేష్ట

- **ప్రొఫెసర్ కళ్లల్లో కారం చల్లి..కర్రలతో దాడి**

**భోపాల్,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

మధ్యప్రదేశ్‌లో దారుణం జరిగింది. స్టూడెంట్స్ వికృత చేష్టలు పరాకాష్టకు చేరాయి. ప్రొఫెసర్‌పై విద్యార్థులు కారం చల్లి, కర్రలతో దాడి చేసిన ఘటన మధ్యప్రదేశ్ లోని ప్రభుత్వ జేహెచ్ పీజీ కళాశాలలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం సాయంత్రం ఏడుగురు విద్యార్థుల గుంపు కారం పొడి, కర్రలతో కళాశాలలోకి వచ్చారు. అనంతరం ఓ తరగతి గదిలోకి ప్రవేశించి అక్కడ విద్యార్థులకు క్లాస్ చెబుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ నీరజ్ ధాకడ్‌పై ఒక్కసారిగా దాడికి దిగి కళ్లల్లో కారం చల్లి, కర్రలతో కొట్టారు. ఈ హఠాత్పరిణామంతో కంగుతిన్న విద్యార్థులు, ఇతర అధ్యాపకులు దాడి చేస్తున్నవారిని ఆపడానికి ప్రయత్నించారు. నీరజ్‌ను జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆయనకు తీవ్ర గాయాలైనట్లుగా వైద్యులు పేర్కొన్నారు. దాడి దృశ్యాలు రికార్డ్ అయిన సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నారని, వారిని అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల కళాశాల స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన అవకతవకలపై ప్రొఫెసర్ నీరజ్‌కు, కళాశాల పూర్వ విద్యార్థి అన్నూ ఠాకూర్ మధ్య వాగ్వాదం జరిగిందని కళాశాల యాజమాన్యం తెలిపింది. ప్రొఫెసర్ సంతకాన్ని, కాలేజీ స్టాంప్‌ను దుర్వినియోగం చేయడానికి ప్రయత్నించిన ఠాకూర్‌ను నీరజ్ వారించారని ఇది వారి మధ్య ఘర్షణకు దారితీసిందని పేర్కొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో మోడీ చెలగాటం

- **నీట్ అవకతవకలే ఇందుకు నిదర్శనం**
- **ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు వి.పి సాను**

**శ్రీకాకుళం,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

విద్యార్థుల జీవితాలతో ప్రధాని నరేంద్ర మోడీ చెలగాటమాడుతున్నారని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు వి.పి సాను అన్నారు. నీట్ పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకలతో ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోయారని, దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సమాజానికి, విద్యారంగానికి తీవ్ర నష్టం చేసే జాతీయ విద్యా విధానాన్ని తెరపైకి తెచ్చింది మోడీ ప్రభుత్వమేనని విమర్శించారు. శ్రీకాకుళం రూరల్ మండలం చింతాడలోని జి.ఎల్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్లీనరీలో ముఖ్య అతిథిగా ప్రారంభోపన్యాసం చేశారు. సమావేశం ప్రారంభ సూచికగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాను మాట్లాడుతూ దేశ ప్రజలకు బిజెపి మతోన్మాదం నుంచి ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో పడనున్నాయని చెప్పారు. అయోధ్యలో రామమందిరం మీద ఉన్న శ్రద్ధ దేశంలో ఉన్న నిరుద్యోగ విద్యార్థి, యువజనులపై ఉంటే దేశ ప్రగతి కొంతమేరైనా సాధ్యపడే దన్నారు. యువతకు రెండు కోట్ల ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పి మోసం చేశారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అయోధ్య రామ మందిరం పేరుతో మభ్యపెట్టేందుకు ప్రయత్నించినా, అయోధ్యలోని ఫైజాబాద్ నియోజకవర్గ ప్రజలు సైతం తిరస్కరించారని తెలిపారు. విద్యారంగంలో సైతం కాషాయీకరణ చొప్పించి కలుషితం చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. 400 స్థానాల్లో గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చాలని చూసిన బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం నేర్పారన్నారు. దేశం సర్వసత్తాక సౌమ్యవాద గణతంత్ర లౌకిక ప్రజాస్వామ్య దేశంగా పరిఢవిల్లాలంటే అది కేవలం విద్యార్థుల చేతుల్లోనే ఉందని, అందుకనుగుణంగా విద్యార్థులు పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగినా పాలకుల విధానాలు మారవని అభిప్రాయపడ్డారు. నాణ్యమైన విద్య, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పన, వసతిగృహ విద్యార్థుల సమస్యలపై పోరాటానికి కార్యాచరణ అమలు చేసి ఒక ప్రణాళిక ప్రకారం పోరాడాలని కోరారు. స్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని నూతన విద్యా విధానాన్ని ఎపిలోనే అమలు చేయడం ద్వారా గత ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణతా శాతం దారుణంగా పడిపోయిందన్నారు. డిగ్రీలో ఆన్‌లైన్ ప్రవేశాలు, ఆనర్స్ కోర్సుకు ప్రవేశాలు వంటి కొత్త విధానాలు తీసుకురావడం వల్ల విద్యార్థులు తీవ్ర వ్యయప్రయాసలకు లోనవుతున్నారని చెప్పారు. సెల్ఫ్ ÷నాన్స్ డే కోర్సులు తీసుకురావడం వల్ల డిగ్రీ చదువుపై విద్యార్థుల ఆసక్తి తగ్గిందన్నారు. వైసిపి ప్రభుత్వం అవలంభించిన అస్తవ్యస్త విధానాలను సరిచేయడంతో పాటు విద్యారంగం సమస్యలను పరిష్కరిస్తామని మేనిఫెస్టోలో పెట్టిన టిడిపి, ఆ హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అభ్యుదయ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వినోద్, రామ్మోహన్, వెంకటేష్, ఎల్.జె నాయుడు, వెంకటేష్, కిరణ్ పరమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ తదితరులు పాల్గన్నారు.

## ఎపికి బ్రాండ్‌గా అమరావతి నిర్మాణం

- **రెండున్నరేళ్లలో నిర్మించి తీరుతాం**
- **మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి**

**అమరావతి,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**



అమరావతిని అత్యుత్తమ రాజధానిగా తీర్చిదిద్దుతామని పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. అమరావతిని ఎపికి బ్రాండ్‌గా నిలబెడతామని అన్నారు. రాజధాని అభివృద్ధిపై శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాజధాని అభివృద్ధికి పక్కా ప్రణాళిక సిద్ధంగా ఉంది. రెండున్నరేళ్లలో నిర్మాణం పూర్తవుతుంది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అమరావతి రాజధాని నిర్మాణానికి కేవలం 58 రోజుల్లోనే 34 వేల ఎకరాలను రైతులు అందజేశారు. కేవలం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతోనే స్వచ్ఛందంగా రైతులు ముందుకొచ్చారు. గతంలో రూ.48వేల కోట్లతో రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులకు టెండర్లు ఆహ్వానించాం. రూ.9వేల కోట్లతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర మౌలిక వసతులు కల్పించాం. అనేక భవన నిర్మాణాలు వివిధ దశల్లోనే నిలిచిపోయాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరోసారి రాజధానిని అభివృద్ధి చేసే బాధ్యతను నాపై ఉంచారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టేందుకు అహర్నిశలు శ్రమిస్తా. గత ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం మోపింది. చెత్తపన్నుతో సామాన్యులు బాగా ఇబ్బందులు పడ్డారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు అత్యాధునిక టెక్నాలజీతో 11 లక్షల టిడ్కో ఇళ్లు నిర్మించాం. వాటిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. త్వరలోనే అన్ని సౌకర్యాలతో ఆ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం' అని నారాయణ తెలిపారు.

## కిషన్ రెడ్డికి డిప్యూటీ సిఎం పవన్ బర్త్‌డే శుభాకాంక్షలు

**అమరావతి,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**



కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డికి ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా జీవితంలో క్షేత్ర స్థాయి నుంచి నిబద్ధతతో అడుగులు వేస్తూ కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి ఎదిగారని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశిరచుకున్న లక్ష్యాలు అందుకునేందుకు బొగ్గు, గనుల శాఖ ఎంతో కీలకమని తెలిపారు. ఆ బాధ్యతలను కిషన్ రెడ్డి విజయవంతంగా నిర్వర్తించగలరని విశ్వసిస్తున్నానని అన్నారు. ఆయనకు ఆ శక్తిని, ఆరోగ్య, ఆనందాలను అందించాలని భగవంతుడిని కోరుకొంటున్నానని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## 531 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు భర్తీ

**హైదరాబాద్,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

వైద్య ఆరోగ్య శాఖలో వివిధ పోస్టుల భర్తీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. 531 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే వీటితో పాటుగా193 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనుంది. 31 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ ఇవ్వనుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనుంది ప్రభుత్వం. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఆసుపత్రులు, విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై దృష్టిసారించింది.

## ప్రజలకు కర్నాటక కాంగ్రెస్ షాక్

- **పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ పెంచిన ప్రభుత్వం**
- **లీటర్ పెట్రోల్‌పై 3కు పైగా పెరుగుదల..వెంటనే అమల్లోకి ఆదేశాలు**

**బెంగళూరు,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

వాహనదారులకు కర్నాటకలో కాంగ్రెస్ సర్కారు షాకిచ్చింది. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. ఈ మేరకు పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ పెంచినట్టు కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు శనివారం మధ్యాహ్నం నోటిఫికేషన్ విడుదల చేసింది. కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాహనదారులకు గట్టి షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్ర పరిధిలోని సేల్స్ ట్యాక్స్‌ను పెంచింది. దీంతో వీటి ధరలు రూ.3 మేర పెరిగాయి. ఈ పెంపు తక్షణమే అంటే శనివారం నుంచే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. ఈమేరకు శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పెట్రోల్‌పై కర్ణాటక సేల్స్ ట్యాక్స్‌ను 25.92శాతం నుంచి 29.84శాతానికి పెంచారు. ఇక, డీజిల్‌పై అమ్మకం పన్నును 14.3 శాతం నుంచి 18.44 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. తాజా పెంపుతో రాష్ట్రంలో లీటర్ పెట్రోల్ ధర రూ.3, డీజిల్ ధర రూ.3.05 మేర పెరుగుతున్నట్లు కర్ణాటక పెట్రోలియం డీలర్స్ అసిసోయేషిన్ తెలిపింది. దీంతో బెంగళూరులో లీటర్ పెట్రోల్ ధర రూ.102.86, డీజిల్ ధర రూ.88.94కు చేరింది. ఈ పెంపుతో రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.2,500-2,800 కోట్ల మేర ఆదాయం సమకూరనున్నట్లు కర్ణాటక ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్నాయి. చివరిసారిగా రాష్ట్రంలో 2021 నవంబరులో అప్పటి భాజపా సర్కారు పెట్రోల్, డీజీల్ ధరలను సవరించింది. కొవిడ్ తర్వాత ప్రజలకు ఊరట కల్పించేందుకు పెట్రోల్‌పై రూ.13.30, డీజిల్‌పై రూ.19.40 మేర తగ్గించింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ధరలను సవరించడం మళ్లీ ఇప్పుడే. కాగా.. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన వెంటనే చమురు ధరల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గమనార్హం.ఈ పెంపు తక్షణమే అమల్లోకి వస్తుందని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ప్రభుత్వ నోటిఫికేషన్ అందుకున్న 'అఖిల కర్ణాటక ఫెడరేషన్ ఆఫ్ పెట్రోలియం ట్రేడర్స్'.. నోటిఫికేషన్‌కు అనుగుణంగా పెట్రో రేట్లను సవరించినట్లు వెల్లడించింది.

## పార్టీకి వెన్నుపోటు పొడిచినవారిని తిరిగి తీసుకోను

**షిండే వర్గానికి హెచ్చరిక చేసిన ఉద్దవ్ థాక్రే**

**ముంబై,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**



మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే కీలక వ్యాఖ్యలు చేశారు. తనను వీడిన వారిని తిరిగి పార్టీలోకి తీసుకోబోనని తెలిపారు. సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గానికి ఈ మేరకు మెసేజ్ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో శనివారం ఆ కూటమి నేతలు సమావేశమయ్యారు. ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్, కూటమిలోని ఇతర సీనియర్ నేతలతో పాటు ఉద్ధవ్ ఠాక్రే కూడా మీడియాతో మాట్లాడారు. ఏక్‌నాథ్ షిండే శిబిరంలోని శివసేన నాయకులను వెనక్కి తీసుకునే అవకాశాన్ని ఆయన తోసిపుచ్చారు. 'నన్ను విడిచిపెట్టిన వారిని పార్టీలోకి తిరిగి తీసుకోను' అని స్పష్టం చేశారు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ప్రతిపక్ష కూటమి కలిసి పోటీ చేస్తుందని ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు. ÷ాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే తమ పోరాటమని చెప్పారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం మాదిరిగా మారిందని అన్నారు. ఈ ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చూడాలని వ్యాఖ్యానించారు. తమ ఎంవీఏ ప్రభుత్వాన్ని మూడు చక్రాల రిక్షాగా దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారని, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పరిస్థితి కూడా అలాగే ఉందని ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీకి పాలాభిషేకం





**కర్నూలు, జూన్ 15 (పీపుల్స్ మోటివేషన్ ):-**

విభిన్న ప్రతిభావంతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ అండగా ఉంటారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టి.జి భరత్ అన్నారు. పింఛన్ రూ.3 వేల నుండి రూ.6 లకు పెంచినందుకు శనివారం నగరంలోని టి.జి భరత్ కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల సమక్షంలో చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. పింఛన్ పెంపుతో వికలాంగులందరూ ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు. వికలాంగుల జీవితాల్లో సీఎం చంద్రబాబునాయుడు వెలుగులు నింపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప, జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్, టిడిపి విభిన్న ప్రతిభావంతుల విభాగం జిల్లా అధ్యక్షులు కుమ్మరి మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి మక్బుల్ బాషా, జేఏసీ నాయకులు నాగరాజు, ఈరన్న, శివ, శంకర్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లాను స్మార్ట్ సిటిగా తీర్చిదిదేందుకు కృషి చేస్తాం

- **ఆంధ్రప్రదేశ్ ను గుజరాత్ రాష్ట్రం తరహాలో పారిశ్రామికాభివృద్ధి చేస్తాం**
- **21 రోజులలో సింగిల్ విండో క్లియరెన్స్‌కు చర్యలు తీసుకుంటాం**
- **రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం & ఆహారశుద్ధి శాఖ మంత్రివర్యులు టిజి భరత్**

**కర్నూలు, జూన్ 15 (పీపుల్స్ మోటివేషన్ ):-**

కర్నూలు జిల్లాను స్మార్ట్ సిటిగా తీర్చిదిదేందుకు కృషి చేయడంతో పాటు శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం & ఆహారశుద్ధి శాఖ మంత్రివర్యులు టి.జి. భరత్ మీడియా సమావేశంలో తెలిపారు. శనివారం స్థానిక న్యూ మున్సిపల్ కౌన్సిల్ హాలులో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రివర్యులు టి.జి.భరత్ మీడియా ప్రతినిధులతో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రచారానికి వెళ్ళిన సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కల్లారా చూడడం జరిగిందని అదే విధంగా ప్రజల నుండి విన్నతుల రూపంలో వచ్చిన సమస్యల గురించి అన్నింటిని ఈరోజు మున్సిపల్ కమిషనర్ గారితో చర్చించి వాటి పరిష్కారం కొరకు పలు సూచనలు జారీ చేయడం జరిగిందన్నారు.. కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటి గా తీర్చిదిద్దెందుకు గాను అన్ని రకాల చర్యలను త్వరితగతిన చేపడతామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలు తీసుకుని వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని, రానున్న 5 సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గుజరాత్ రాష్ట్రం తరహాలో పారిశ్రామికాభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. పారిశ్రామిక అభివృద్ధితో పాటు ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్ ను కూడా అభివృద్ధి చేస్తామన్నారు.. గతంలో




పారిశ్రామిక రంగానికి సంబంధించి ఎంఓయు చేసుకున్న వాటిని తిరిగి అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. 21 రోజులలో సింగిల్ విండో క్లియరెన్స్ కు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రెస్ కాన్ఫరెన్స్ లో మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి భరత్‌ను కలిసిన ప్రముఖులు





**కర్నూలు, జూన్ 15 (పీపుల్స్ మోటివేషన్ ):-**

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి భరత్‌ను శనివారం పలువురు ప్రముఖులు కలిశారు. టిజి భరత్ కార్యాలయంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జిల్లా ఎస్పీ క్రిష్ణకాంత్, టిడిపి సీనియర్ నాయకులు గౌరు వెంకట రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, పరిశ్రమల శాఖ జెడ్. ఎం సోమశేఖర్ రెడ్డి, జీఎం ప్రసాద్, విద్యుత్ శాఖ ఎస్.ఈ ఉమాపతి, అడిషనల్ ఎస్పీ సుధీర్ బాబు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. అనంతరం రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్, మెప్మా పి.డి నాగశివ లీల, డీపీఓ నాగరాజు, డీఎస్‌డీఓ భూపతి రావ్, ఇరిగేషన్ డీఈ రాజన్ బాబు, డిస్ట్రిక్ట్ కోర్టు మానిటరింగ్ సీఐ రామయ్య నాయుడు, డాక్టర్లు చంద్రశేఖర్, భవానీ ప్రసాద్, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, తదితరులు మంత్రి టిజి భరత్ ను కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి మంత్రితో మాట్లాడారు.

## ఆగస్టు చివరికి బేతంచెర్ల మండలానికి త్రాగునీరు అందిస్తాం - డోన్ ఎమ్మెల్యే కోట్ల



**బేతంచెర్ల, జూన్ 15 (పీపుల్స్ మోటివేషన్ ):-**

ఆగస్టు చివరి నాటికి బేతంచర్ల పట్టణ మరియు మండలంలోని గ్రామాలకు తాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మెగా కంపెనీ నిర్వాహకులు వాసుకు సూచించారు. శనివారం పాణ్యం మండలంలోని గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్ నియోజకవర్గానికి తాగునీరు అందించడానికి రూ.350 కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్ త్రాగునీరు ఇంటెక్ వెల్ ను గోరుకల్లు రిజర్వాయర్ దగ్గరికి వెళ్లి వాటర్ గ్రిడ్ పురోగతి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.అనంతరం బేతంచెర్ల మండలంలోని బుగ్గనిపల్లె తండా వద్ద ట్రీట్మెంట్ ప్లాంట్ నీటి శుద్ధికరణ పనితీరును పరిశీలించారు .ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు నాగేశ్వరావు యాదవ్, వలసల రామకృష్ణ, మండల కన్వీనర్ ఉన్నాం యల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి, నాయకులు బుగ్గన ప్రభాకర్ రెడ్డి, బీమేశ్వర్ రెడ్డి, బుగ్గన ఆనంద్ రెడ్డి,తిరుమలేష్ చౌదరి,మేకల నాగరాజు,రూబెన్,రవీంద్ర నాయక్, అంబాపురం సర్పంచ్ శ్రీనివాసులు, మోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షను వేంటనే రద్దు చెయ్యాలి

- **మళ్ళీ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలి**
- **శ్రీరంగాపూర్ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు యం గంగాధర్ యాదవ్**



**శ్రీరంగాపూర్/ వనపర్తి, జూన్ 15 (పీపుల్స్ మోటివేషన్ ):-**

నీట్ పరీక్ష పేపర్ లీకై విద్యార్థులకు అన్యాయం జరిగిన నేపథ్యంలో యం గంగాధర్ యాదవ్ మాట్లాడుతూ నీట్ పరీక్షను వేంటనే రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. విద్యార్థులందరు రాత్రింబవళ్ళు నిద్రలు తిండి మాని ఈ య్నెక్క పరీక్ష రాశారన్నారు. ఈ యొక్క నీట్ పరీక్ష పేపర్ లీక్ అయిన సందర్భంగా చాల వరకు పెద మధ్యతరగతి విద్యార్థులందరికీ తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలో వచ్చిన ప్రతి సారి తమ కల్లబొల్లి మాటలతో మోసాపూరితమైన హామీలతో విద్యార్థులను నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు. మెడికల్ పరీక్షల కోర్సులకు సంబంధించిన నీట్ పరీక్షలో చోటు చేసుకున్న అక్రమాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.బిజెపి ప్రభుత్వం మరియు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కలిసి లక్షల విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని విమర్శించారు.

## రోడ్లు భవనాల శాఖ మంత్రి బి.సి జనార్దన్ రెడ్డికి ఘనస్వాగతం

**బేతంచర్ల, జూన్15 (పీపుల్స్ మోటివేషన్ ):-**

బనగానపల్లె ఎమ్మెల్యే బి సి జనార్ధన్ రెడ్డి రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొదటగా బేతంచెర్లకు రావడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి,బేతంచెర్ల పట్టణ కార్యదర్శి షేక్షవలి చౌదరి ఆధ్వర్యంలో నంద్యాల క్రాస్ రోడ్డు నుండి బాణా సంచతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని పాత బస్టాండ్ లో భారీ గజమాలతో ఘనంగా సన్మానించారు.మంత్రి బి సి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ మండల టిడిపి నాయకులు ఘనస్వాగతం పలకడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువనాయకులు మన్నే గౌతమ్ రెడ్డి, ఉన్నం చంద్రశేఖర్,పోలూరు కిషోర్,లోకేష్ గౌడ్,అధిక సంఖ్యలో మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలను పక్కన పెట్టి ఆరు స్కామ్‌లు

**బిఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపణ**

**హైదరాబాద్,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా ఆరు నెలల్లో ఆరు స్కాంలకు పాల్పడిందని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో క్రిశాంక్ మీడియాతో మాట్లాడారు. బియ్యం స్కాం, లిక్కర్ స్కాం,, ÷÷-ల యాష్ స్కాంలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరతీసిందని విమర్శించారు. జనవరి 11న ఆర్టీసీ డిజిటల్ టిక్కెట్ల కోసం ఇచ్చిన టెండర్‌ను రద్దు చేసి.. ఆఫ్‌లైన్ టెండర్‌ను తీసుకువచ్చారని మన్నె క్రిశాంక్ అన్నారు. ఎన్ని సంస్థలు వచ్చాయి, ఎంత అమౌంట్‌కు కోట్ చేశారో చెప్పలేదని తెలిపారు. గుట్టుచప్పుడు కాకుండా ఛలో మొబిలిటీ అనే సంస్థకు టెండర్‌ను కట్టబెట్టారని విమర్శించారు. ఆర్టీసీ టిక్కెట్ కమీషన్ నేరుగా ఆ కంపెనీ ఖాతాలోకి వెళ్తుందని అన్నారు. కాంట్రాక్టు గురించి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎందుకు గోప్యత పాటించారని ప్రశ్నించారు.రాష్ట్రవ్యాప్తంగా 13,200 మిషిన్స్ కొనుగోలు చేశారు.. ప్రతి టిక్కెట్ కమీషన్ కంపెనీకి వెళ్తుందని క్రిశాంక్ ఆరోపించారు. ఈ కమీషన్‌లో పొన్నం ప్రభాకర్ వాటా ఎంత అని నిలదీశారు. ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసుల ప్రభుత్వంగా మారిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో టెండర్ల పక్రియ ఓపెన్‌గా జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిపై ప్రశ్నిస్తే ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కొనుగోలు, కాళేశ్వరం అంటూ డైవర్ట్ చేస్తున్నారని అన్నారు. రవాణా శాఖలో అవినీతిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని కోరారు.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation


# కర్నూలు నగరానికి నీటి ఎద్దడి లేకుండా కృషి చేద్దాం

- శుద్ధమైన త్రాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటాం
- నగరంలోని పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెడతాం
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రివర్యులు టి.జి.భరత్

**కర్నూలు, జూన్ 15 (పీపుల్స్ మోటివేషన్ ):-**

కర్నూలు నగరానికి నీటి ఎద్దడి లేకుండా శుద్ధమైన త్రాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టి.జి.భరత్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక న్యూ మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమీషనర్ అధ్యక్షతన కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని విభాగాల అధికారులతో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి మాట్లాడుతూ తనకు అభినందనలు చెప్పిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం త్రాగు నీటి అంశంపై సమీక్షిస్తూ వర్ష కాలంలో నగరంలో చాలా చోట్ల పైప్ లైన్స్ ద్వారా వచ్చే రంగు నీరు రావడం లేక బురద నీరు రావడం గమనించడం జరిగిందని శాస్త్రీయ రసాయనమైన అల్యూమినియం సల్ఫేట్ ద్రావణాన్ని వాడి శుద్ధమైన నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ను సూచించారు. ప్రజలు త్రాగు నీటికి ఇబ్బంది లేకుండా అన్ని చోట్ల సరైన సమయంలో అందజేయాలన్నారు. పైప్ లైన్లు, కొళాయిలు దెబ్బతినడం వల్ల చాలా చోట్ల పట్టుకునే నీటి కన్న వృధా అయ్యే నీరు ఎక్కువ శాతంగా గమనించడం జరిగిందని వాటిని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన దిశగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.




వేసవి, వర్ష కాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని అందుకుగాను వాటి నివారణ కోసం మా హైపో పరిశ్రమ నుంచి ఉచితంగా హైపో ద్రావణాన్ని కూడా అందజేస్తామని వాటిని అవసరం ఉన్న చోట పిచికారి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్ష కాలంలో కొద్దిపాటి వర్షాలు కురిసిన కూడా ఓల్డ్ టౌన్, బుధవారపేట ప్రాంతాల్లోకి నీరు వచ్చే అవకాశం ఉందని అందుకుగాను ముందుగా హంద్రీ నదిలో స్టిల్ట్, బురదను తొలగించేలా ప్రణాళిక వేసుకోవాలన్నారు. అమృత్-2 కు సంబంధించి కర్నూలు నగరానికి శాశ్వత నీటి పరిష్కారం కోసం ఏ ప్రాజెక్టు ద్వారా (గుండ్రేవుల ప్రాజెక్టు, చెక్ డ్యాం, లేక సుంకేసుల నుంచి డబుల్ పైప్ లైన్స్ వేసుకోవడమా, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పరిమాణాన్ని పెంచుకోవడమా) అవసరమైన నీటిని అందించేందుకు సమగ్రంగా పరిశీలించి ఏదైతే నగరానికి మంచిదైతే అందుకు తగిన ప్రణాళిక చర్యలు తీసుకోవాలన్నారు. చిరు వ్యాపారులకు సంబంధించి వారికి ప్రత్యామ్నాయ ప్రదేశాలు చూపించిన తరువాత వాటిని ఖాళీ చేయించాలని, వారు రోడ్డు మీద వ్యాపారం చెయ్యకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా రోడ్డు విస్తరణకు సంబంధించిన చర్యలు ప్రణాళిక తయారు చేసు కోవాలన్నారు. పాదచారుల కోసం ఫుట్ పాత్ క్లియర్ గా ఉండేలా చూడాలన్నారు. గతంలో రింగ్ రోడ్డు కు సంబంధించి సెయింట్ జోసెఫ్ కళాశాల వద్ద ఎంట్రీ ఇచ్చి ఓల్డ్ టౌన్ లో ముగించేలా కార్యాచరణ రూపొందించామని, అయితే సాయిబాబా గుడి వరకు వచ్చి పనులు ఆగిపోవడం జరిగిందని దాని వల్ల కొంత మేరకు ట్రాఫిక్ తగ్గే అవకాశం ఉందని దానిపై కూడా దృష్టి సారించాలన్నారు. ట్రాఫిక్ ను నియంత్రించడానికి అవసరమైన ప్రత్యామ్నాయ మార్గాలతో పాటు ఫ్లైఓవర్స్ కూడా నిర్మించడం వల్ల ట్రాఫిక్ ను నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. నిరాశ్రయుల కోసం ఏర్పాటు చేసిన గృహాల్లో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలన్నారు. టిడ్కోకు సంబంధించి అర్హులైన వారికి గృహాలను అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హంద్రీ నదిలో ఎక్కువ శాతం డ్రైనేజీను డంప్ చేయడం జరుగుతుందని అలా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ కు సంబంధించి మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ ద్వారా నిర్వహణ చేసి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వర్ష కాలంలో పెద్ద ఎత్తున చెట్లు నాటి అందుకు తగిన రిపోర్టు ఇవ్వడంతో పాటు వాటికి సరైన విధంగా రక్షణ ఏర్పాటు చేయాలన్నారు. పెద్ద పెద్ద చెట్లను నరకకుండా పర్యావరణాన్ని రక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 17వ తేదిన బక్రీద్ పర్వదినం సందర్భంగా ఈద్గాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు నగరాన్ని సుందరంగా, సస్యశ్యామలంగా తీర్చిదిద్దేలా అందరం కలిసికట్టుగా పని చేయాలన్నారు. తొలుత మునిసిపల్ కార్పొరేషన్ కింద చేస్తున్న అభివృద్ధి పనుల గురించి, అమృత్ 2.0 కింద కొత్తగా ప్రపోజ్ చేసిన పనుల గురించి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ గురించి, కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైటింగ్ గురించి, త్రాగు నీటి సరఫరా గురించి, కార్పొరేషన్ ఆదాయం, వ్యయం గురించి రాష్ట్ర మంత్రి వర్యులకు మున్సిపల్ కమీషనర్ భార్గవ్ తేజ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో నగరపాలక సంస్థ మున్సిపల్ కమీషనర్ భార్గవ తేజ, అదనపు కమీషనర్ రామలింగేశ్వర్, నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అకాడమీలో అరుదైన దృశ్యం

- ఐఎఎస్‌గా వచ్చిన కూతురికి తండ్రి సెల్యూట్





**హైదరాబాద్,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

ఐఏఎస్ అధికారిణిగా పోలీస్ అకాడమీకి వచ్చిన కుమార్తెకు ఆ పోలీస్ అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఐపీఎస్ తండ్రి సెల్యూట్ చేశాడు. హైదరాబాద్ చిల్కూరు ఏరియాలోగల 'రాజ్‌బహదూర్ వేంకట రంగారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ లో శనివారం మధ్యాహ్నం ఈ అత్యంత అరుదైన ఘటన జరిగింది. శనివారం ఏడుగురు ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులు ప్రాక్టికల్ ట్రెయినింగ్ కోసం అకాడమీకి వచ్చారు. వారికి పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్‌కు బదులుగా.. జాయింట్ డైరెక్టర్ డీ మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్ వేంకటేశ్వర్లు స్వాగతం పలికారు. అనంతరం అకాడమీ మరో డిప్యూటీ డైరెక్టర్ సీ నర్మద ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులకు బ్రీఫ్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సెషన్‌లో ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులు తమ ట్రెయినింగ్ అనుభవాలను పంచుకున్నారు. ఆ తర్వాత ట్రెయినీ ఐఏఎస్‌లు పోలీస్ అకాడమీ క్యాంపస్ అంతటా కలియ తిరిగారు. ఈ సందర్భంగా అకాడమీలోని అధికారులు.. పోలీస్ ట్రెయినింగ్‌కు సంబంధించిన పలు అంశాలను క్షుణ్ణంగా వివరించారు. అయితే పోలీస్ అకాడమీకి ప్రాక్టికల్ ట్రెయినింగ్ కోసం వచ్చిన ఏడుగురు 2023 బ్యాచ్ ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారుల్లో ఉమాభారతి ఒకరు. ఆ ఏడుగురు ఐఏఎస్ అధికారులకు సెల్యూట్ చేసి స్వాగతం పలికిన వారిలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ వేంకటేశ్వర్లు ఉన్నారు. ఆయన ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి ఉమా భారతికి కన్నతండ్రి. ఐఏఎస్ అధికారిణిగా వచ్చిన బిడ్డకు ఐపీఎస్ తండ్రి సెల్యూట్ చేసిన ఈ ఘటన అకాడమీలో ఓ ప్రత్యేకతగా నిలిచింది. ప్రస్తుతం ఉమాభారతి వికారాబాద్ జిల్లాలో ట్రెయినీ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు.

## ఫోక్సో కేసులో సిఐడి ఎదుట 17న హాజరు

- మాజీ సిఎం యెడ్యూరప్ప వెల్లడి

**బెంగళూరు,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

తనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి జూన్ 17న దర్యాప్తు కోసం సిఐడి ఎదుట హాజరవుతానని బిజెపి సీనియర్ నాయకుడు, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి బిఎస్ ఎడియూరప్ప శనివారం తెలిపారు. శనివారం బెంగళూరు చేరుకున్న ఎడియూరప్ప విలేకరులతో మాట్లాడుతూ తనకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్న వారికి ప్రజలు గుణపాఠం నేర్పుతారని అన్నారు. పోక్సో కేసులో ఎడియూరప్ప అరెస్టును నిలుపుదల చేస్తూ కర్నాటక హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. అయితే జూన్ 17న దర్యాప్తు నిమిత్తం సిఐడి ఎదుట హాజరు కావాలని ఎడియూరప్పను హైకోర్టు ఆదేశించింది. ముందుగా నిర్ణయించిన కార్యక్రమం కోసం నేను ఢిల్లీకి వెళ్లాను. జూన్ 17న దర్యాప్తు కోసం హాజరవుతానని ముందుగానే లిఖితపూర్వకంగా సమాచారం అందచేశాను. సిఐడి నన్ను అరెస్టు చేయకుండా హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. సోమవారం సిఐడి ఎదుట హాజరవుతాను. గందరగోళం సృష్టించడానికి కొందరు అనవసరంగా ప్రయత్నించారు. ఎవరినీ నిందించదలచుకోలేదు. అందరికీ వస్తావం ఏమిటో తెలుసు అని ఎడియూరప్ప తెలిపారు. నాకు వ్యతిరేకంగా కుట్రలకు పాల్పడేవారికి ప్రజలు గుణపాఠం చెబుతారు అని కూడా ఆయన హెచ్చరించారు. ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్(పోక్సో) చట్టం కింద ఈ ఏడాది మార్చి 14న ఎడియూరప్పపై కేసు నమోదైంది. ఈ నెల 12న (బుధవారం) తమ ఎదుట హాజరుకవాలని సమన్లు జారీచేసినప్పటికీ ఎడియూరప్ప గైర్హాజరు కావడంతో ఆయనపై అరెస్టు వారెంట్ జారీచేయాలని కోరుతూ సిఐడికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఫస్ట్

ఫాస్ట్ ట్రాక్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. గురువారం కోర్టు ఎడియూరప్పపై నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీచేసింది. తన 17 ఏళ్ల మైనర్ కుమార్తెపై ఈ ఏడాది ఫిబ్రవరి 2న బెంగళూరులోని డాలర్ల కాలనీ నివాసంలో ఎడియూరప్ప లైంగిక దాడి జరిపినట్లు ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసును నమోదు చేయగా కర్నాటక డిజిపి ఆదేశం మేరకు ఈ కేసును సిఐబికి బదిలీ చేశారు. తనపై వచ్చిన ఆరోపణలను ఖండించిన ఎడియూరప్ప ఈ కేసును తాను న్యాయపరంగా ఎదుర్కొంటానని తెలిపారు. ముందస్తు జామీనుతోపాటు ఎఫ్ఐఆర్‌ని కొట్టివేయాలని కోరుతూ ఆయన హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఎడియూరప్పపై ఆరోపణలు చేసిన ఆ 53 సంవత్సరాల మహిళ గత నెలలో ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించారు. కాగా..మార్చి 14న కేసు నమోదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఈ కేసులో ఎటువంటి పురోగతి లేదని ఆరోపిస్తూ బాధితురాలి సోదరుడు గత ఆరం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎడియూరప్పను అరెస్టు చేసి ప్రశ్నించడానికి పోలీసులకు ఆదేశాలు జారీచేయాలని ఆయన కోర్టును

## వందేభారత్‌లో ఇక బెర్తులు

- త్వరలోనే అందుబాటులోకి తెస్తాం
- కేంద్రమంత్రి వైష్ణవీ అశ్విన్ వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

ప్రధాన నగరాలు, పట్టణాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు కేంద్రప్రభుత్వం వందే భారత్ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే వందేభారత్ ఏసీ చైర్‌కార్ రైళ్లు అందుబాటులోకి రాగా.. తాజాగా వందే భారత్ స్లీపర్ కోచ్ రైళ్లను రైల్వే శాఖ అందుబాటులోకి తీసుకురానుంది. గత కొంతకాలంగా ఈ పక్రియ కొనసాగుతోంది. తాజాగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వందే భారత్ స్లీపర్ కోచ్ రైళ్లకు సంబంధించి ఓ ప్రకటన చేశారు. మరో రెండు నెలల్లోనే వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలపై పరుగులు తీయనుందన్నారు. మరోవైపు వెయిటింగ్ లిస్ట్ సిస్టమ్‌కు పరిష్కారం కోసం రైల్వే శాఖ ప్రయత్నిస్తోందని అన్నారు. రైళ్ల సంఖ్య, బెర్తుల సంఖ్య పెంచడం ద్వారా వెయిటింగ్ లిస్ట్ సమస్య పరిష్కారమవుతుందని అన్నారు. మరో 60 రోజుల్లోనే వందే భారత్ స్లీపర్ రైళ్లు అందుబాటులోకి రానున్నట్లు అశ్విని వైష్ణవ్ తెలిపారు. వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలపై పరుగులు తీయడానికి సిద్ధంగా ఉందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇప్పటికే ఈ రైళ్ల కోసం రెండు ప్రత్యేక ట్రాక్‌లను సిద్ధం చేశామన్నారు. ఈ రెండు ట్రాక్‌లపై ట్రయల్స్ పూర్తైన తర్వాత ప్రయాణీకులకు వందే భారత్ స్లీపర్ రైళ్లు అందుబాటులో రానున్నట్లు తెలిపారు. ప్రయోగ దశలో నాలుగు స్లీపర్ క్లాస్ కోచ్‌లతో రైలును సిద్ధం చేసినట్లు తెలిపారు.రానున్న ఐదేళ్లలో సుమారు 400 వందే భారత్ రైళ్లు అందుబాటులోకి రానున్నట్లు రైల్వే మంత్రి తెలిపారు.

## మాజీ ప్రధాని ఇందిర భారత మాత

**కరుణాకరన్, ఇకె నయనార్‌లు రాజకీయ గురువుల**

**కేంద్ర మంత్రి సురేష్ గోపి వ్యాఖ్య**

**తిరువనంతపురం,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

కేంద్ర మంత్రి సురేష్ గోపి కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ భారత మాత అని కితాబిచ్చారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సీఎం కరుణాకరన్, మార్క్సిస్ట్ సీనియర్ నేత ఈకే నాయనార్ తన రాజకీయ గురువులని అన్నారు. కేరళలో బీజేపీ నుంచి గెలిచిన ఏకైక ఎంపీ సురేష్ గోపి బుధవారం పున్‌కున్నంలోని కరుణాకరన్ స్మారకం మురళీ మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కరుణాకరన్ స్మారకం సందర్శనకు ఎలాంటి రాజకీయాలు జోడించవద్దని మీడియాను కోరారు. తన గురువుకు నివాళి అర్పించేందుకే ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు.కాగా, మార్క్సిస్ట్ సీనియర్ నేత ఈకే నాయనార్, ఆయన భార్య శారద టీచర్ మాదిరిగా కరుణాకరన్, ఆయన భార్య కల్యాణికుట్టి అమ్మతో తమ కుటుంబానికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని నటుడి నుంచి రాజకీయ నేతగా మారిన సురేష్ గోపి తెలిపారు. జూన్ 12న కుటుంబ సభ్యులతో కలిసి కన్నూర్‌లోని నాయనార్ ఇంటికి కూడా ఆయన వెళ్లారు. మరోవైపు ఇందిరా గాంధీని భారత మాతగా తాను భావిస్తానని సురేష్ గోపి చెప్పారు. అలాగే కరుణాకరన్‌ను కేరళ కాంగ్రెస్ తండ్రిగా ఆయన అభివర్ణించారు. కరుణాకరన్ ధైర్యవంతమైన పాలకుడని ప్రశంసించారు. లోక్‌సభ ఎన్నికల్లో త్రిసూర్ నుంచి పోటీ చేసిన సురేష్ గోపీ బీజేపీ అభ్యర్థిగా గెలిచారు. ఆయనపై బరిలో నిలిచిన కరుణాకరన్ కుమారుడు, కాంగ్రెస్ అభ్యర్థి కె మురళీధరన్ మూడో స్థానానికి పరిమితమయ్యారు.

## ప్రతీకార రాజకీయాలకు మేమెప్పుడూ దూరమే

**అలాంటి అలవాటు కేవలం బిజెపికి మాత్రమే ఉంది**

**ఎడ్యూరప్పపై ఫోక్సో కేసులో సిఎం సిద్ధరామయ్య స్పష్టీకరణ**

**బెంగళూరు,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ) :**

తాను కాని, తన ప్రభుత్వం కాని ప్రతీకార రాజకీయాలకు పాల్పడలేదని, భవిష్యత్తులో కూడా పాల్పడబోమని కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పష్టం చేశారు. అటువంటి రాజకీయాలు చేసేది బిజెపి మాత్రమేనని ఆయన ఆరోపించారు.పోక్సో కేసులో మాజీ ముఖ్యమంత్రి బిఎస్ ఎడియూరప్పపై అరెస్టు వారెంట్ జారీకావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందంటూ బిజెపి, జెడియు చేస్తున్న ఆరోపణలను శుక్రవారం ఆయన ఖండించారు. మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ కుటుంబాన్ని టా÷-గ్గ÷ట్ చేసిన తర్వాత ఇప్పుడు ఎడియూరప్ప కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం టా÷-గ్గ÷ట్ చేసిందంటూ కేంద్ర మంత్రి హెచ్‌డి కుమారస్వామి చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. శుక్రవారం నాడిక్కడ సిద్దరామయ్య విలేకరులతో మాట్లాడుతూ తమపై వారు(బిజెపి) కేసులు నమోదు చేసినపుడు అది టా÷-గ్గ÷ట్ చేయడం కాదా అని ప్రశ్నించారు. తనపైన, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌పైన, తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపైన కేసులు నమోదు చేయడాన్ని ఏమంటారని ఆయన ప్రశ్నించారు. రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని ఏమని అంటారని ముఖ్యమంత్రి బిజెపిని నిలదీశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్‌ను జైలుకు పంపించారు. దాన్ని విద్వేష రాజకీయాలు అంటారా? లేక ప్రేమ రాజకీయాలు అంటారా? కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడేది వాళ్లు. మేమెప్పుడూ అలాంటి రాజకీయాలు చేయము. నేనైతే ఇప్పటి వరకు అలాంటివి చేయలేదు. నేను నిన్న, మొన్న రాజకీయాల్లోకి రాలేదు. అది(కక్షసాధింపు రాజకీయాలు) బిజెపి పని అని సిద్దరామయ్య ధ్వజమెత్తారు. కేంద్ర క్యాబినెట్‌లోకి దక్షిణాది రాష్ట్రాల నుంచి 8 మందిని చేర్చుకోవడం దక్షణాదిలో బిజెపిని విస్తరించే పథకంలో భాగమని భావిస్తున్నారా అన్న ప్రశ్నకు వారేం చేసినా దక్షిణ భారతదేశం బిజెపిని నమ్మదని, ఆర్ఎస్ఎస్ రాజకీయ ముసుగులో బిజెపికావడమే ఇందుకు కారణమని ఆయన చెప్పారు. లోక్‌సభ ఎన్నికలలో ఉత్తర భారతంలో కూడా బిజెపికి ఎదురుదెబ్బ తగిలిందని ఆయన చెప్పారు. ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్రలో ఆ పార్టీ అపజయాలను చవిచూసిందని సిద్దరామయ్య అన్నారు. బిజెపి అహంకారానికి ప్రజలు బుద్ధి చెప్పారని ఒక ఆర్ఎస్ఎస్ నాయకుడు అన్నారని ఆయన చెప్పారు. కక్షసాధింపు రాజకీయాలు బిజెపికి అలవాటైన విద్యేనని ఆయన విమర్శించారు.ఇడి, సిబిఐ, ఐటి పేరిట బెదిరింపులకు పాల్పడడం బిజెపి మొదటి నుంచి చేస్తోందని, ఇప్పుడు కూడా అదే పని చేస్తోందని, అందుకే ప్రజలు ఆ పార్టీకి ఈసారి మెజారిటీ ఇవ్వలేదని ముఖ్యమంత్రి చెప్పారు. నీట్ పరీక్ష వివాదాన్ని గురించి ప్రశ్నించగా కష్టపడి చదివిని విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆయన అన్నారు. దానిపై దర్యాప్తు జరగాలని, మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆయన కోరారు. పరీక్షలను ఎన్‌టిఎ సక్రమంగా నిర్వహించలేదని, గ్రేస్ మార్కులు ఇవ్వడం మంచి సంప్రదాయం కాదని, గ్రేస్ మార్కులతో విద్యార్థులను పాస్ చేయడం మంచి పద్ధతి కాదని ఆయన చెప్పారు. జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలను సాధ్యమైనంత త్వరలో నిర్వహిస్తామని ఒక ప్రశ్నకు జవాబుగా ఆయన తెలిపారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆదివారం । జూన్ । 16 । 2024


# బెడిసి కొట్టిన కాంగ్రెస్ ముక్త భారత్ !

కాంగ్రెస్ ముక్త భారత్ అంటూ మోడీ చేసిన ప్రకటన..బూమరాంగ్ అయ్యింది. తొలుత ఈ నినాదంతో కొందరు ఆనందించారు. నిజమే ...వారసత్వ రాజకీయం ఎందుకులే అని ప్రజలు అనుకున్నారు. కానీ మోడీ పిలుపునకు అనుగుణంగా పాలన చేయలేకపోయారు.ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ..ముందుకు సాగివుంటే కాంగ్రెస్ ముక్త భారత పనిచేసివుండేది. కానీ మోడీ కేవలం కాంగ్రెస్‌ను బూచిగా చూపి, సమస్యల పరిష్కారం లో పూర్తిగా విఫలం అయ్యారు. అంతేగాకుండా గతంకన్నా దుర్లభంగా జనం బతుకులు మార్చారు. గతరెండు పర్యాయాలు గెలిచేసరికి ఇక తనకు తిరుగులేదని భావించారు. ఆర్ఎస్ఎస్‌ను కూడా దూరం పెట్టారు. పార్టీలో సీనియర్లను ముందే తొక్కిపెట్టారు. రాహులన్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. కేసులు పెట్టించి నానా ఇక్కట్లకు గురి చేశారు. విపక్ష సిఎంలను అరెస్ట్ చేయించారు. విపక్ష పార్టీల నేతలనే టార్గెట్ చేసి ఇడి, ఐటి కేసులతో వేధించారు. వెరసి మొన్నటి ఎన్నికల్లో మోడీ ఓ రకంగా చెప్పాలంటే ఓటమి పాలయ్యారు. ఇప్పుడు బలపరుస్తున్న ఎన్‌డిఎ నేతలు ప్లేట్ ఫిరాయిస్తే కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది. వారణాసిలో మా చెల్లి ప్రియాంకను నిలిపివుంటే..మోడీ ఓడిపోయేవారని రాహుల్ చేసిన వ్యాఖ్యలు అక్షరాల నిజం. అక్కడ ప్రియాంక నిలిచివుంటే పరిస్థితి మరోలా ఉండేది. రాహుల్ ఎక్కడా విజయం సాధించలేరని సాక్షాత్తు మోడీయే ప్రచారం చేసినప్పటికీ రాహుల్ గాంధీయే ప్రధాన ప్రతిపక్ష నాయకునిగా ఇప్పుడు మోడీకి దీటుగా నిలబడ్డారు. గత పదేళ్ల కాలంలో ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన ఎన్‌డిఎ ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో విపక్షాల గొంతు వినిపించకుండా, చర్చకు అవకాశం ఇవ్వకుండా కర్రపెత్తనంతో వ్యవహరించి బుల్‌డోజ్‌లా దూసుకుపోయింది. ఈ నేపథ్యంలో గత లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెట్టి ఏకపక్షంగా పాస్ చేయించుకున్నారు. ఎన్‌డిఎ మందబలంతో ఆమోదం పొందగలిగాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలు భయంతో మద్దతు ఇచ్చాయి. ఇదంతా విపక్షాల గొంతు వినిపించకుండా చేసినవే నన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అలాంటి దూకుడు పని చేయదని మోడీ గుర్తించాలి. తన వైఫల్యాలే కాంగ్రెస్‌కు ఊపిరి పోశాయని గుర్తించాలి. అవతలి పక్షం ఇప్పుడు బలంగా ఉంది. ఎన్‌డిఎ పసక్షాల ఎంపి లంతా తలచుకుంటే మోడీ ఖేల్ ఖతమని గుర్తించాలి. పార్లమెంట్ అంటేనే ప్రజల సమస్యలపై చర్చించడం అన్న విధానానికి తూట్లు పొడిచారు. వాజ్‌పేయ్, అద్వానీల హయాంలో పార్లమెంటులో ప్రజాస్వామ్య బద్దంగా చర్చలు సాగేవి. బిల్లులపై చర్చించేవారు. ఎందుకు బిల్లుల అవసరముందో చెప్పే



వారు. కానీ మోడీ పదేళ్ల ప ఆలనలో ఒక్క బిల్లుపైనా చర్చించలేదు. వచ్చేనెల పార్లమెంట్ సమావేశాల్లో ఇక మోడీ ద్వయం హుందాగా వ్యవహరించి, విపక్షాలకు చర్చ చేసే అవకాశం ఇవ్వాలి. తమ పాతపద్దతులను, వాసనలు వదులుకుని పార్లమెంట్‌కు రావాల్సి ఉంటుంది. సభలో ఏకాభిప్రాయంతో ఆచితూచి ముందుకెళ్లక తప్పదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ముందు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల సమస్యలు, రైతుల సమస్యలు సవాలుగా ఉంటున్నాయి. వీటిని పరిష్కరించవలసి ఉంటుంది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలను పీడిస్తున్న వ్యవసాయ సంక్షోభం కేంద్రం పరిష్కరించడం తక్షణ కర్తవ్యం. వ్యవసాయ రంగంలో అనుభవం సంపాదించిన శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధిశాఖల మంత్రిగా కేంద్రం నియమించి మంచి పనిచేశారు చౌహాన్ మధ్యప్రదేశ్‌లో వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించగలిగారు. కేంద్రం కీలకమైన శాఖలను తన పాత మంత్రులకే అప్పగించి సంకీర్ణంలో భాగస్వాములైన మిత్ర పక్షాలకు మొక్కుబడి శాఖలిచ్చి బుజ్జగించింది. మిత్ర పక్షాలు కూడా దీనికి కట్టుబడక తప్పడం లేదు. ప్రాధాన్యమైన శాఖల కోసం మిత్రపక్షాలు డిమాండ్ చేసే అర్హత ఉన్నప్పటికీ, తమ మీద ఉన్న ఒత్తిళ్ల కారణంగా ఈ పార్టీలన్నీ కేంద్రసాయం కోసం ఆధారపడక తప్పడం లేదు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ఆంధ్రను ఆర్థిక అవసరాలు తీవ్రంగా ఉన్న దశలో స్వీకరిస్తున్నారు. రాజధాని నిర్మాణానికి, పథకాల అమలుకు కేంద్రం ఆర్థిక చేయూత తప్పనిసరి ఇక బీహార్ సిఎం నితీశ్ కుమార్ పరిస్థితి కూడా ఇంతే. బీహార్ రాష్ట్రం కూడా అనేక పథకాలకు ఆర్థిక సాయం కోసం కేంద్రం వైపు చూస్తోంది. మోడీ కూడా ఈ అవకాశాలను కాదనలేరు. కొత్త ప్రభుత్వం మనుగడ సాగించడానికి ఎప్పటి కప్పుడు ఏకాభిప్రాయ సాధనే అత్యవసరమవుతుంది. నోట్ల రద్దు, వ్యవసాయ బిల్లుల అమలు కోసం అప్పుడు పార్లమెంట్‌లో అంతగా చర్చ సాగలేదు. యూనిఫారం సివిల్ కోడ్, లేదా వన్ నేషన్, వన్ ఎలక్షన్ వంటి వివాదాస్పద అంశాలు సులభంగా చర్చకు రాలేదు. ఇప్పుడు విపక్షాల బలం గట్టిగానే ఉంది. ప్రధాని మోడీ పార్లమెంట్‌లో ఏ బిల్లుపైనా ఆమోదం సాధించాలంటే చర్చించి ఏకాభిప్రాయం సాధించడం కానీ లేదా స్థాయీ సంఘానికి పరిశీలనకు పంపించడం కానీ చేయక తప్పదు. అలాగే ఎన్‌డిఎ పక్షాలను కాదని అడుగు వేసే పరిస్థితి లేదు. అందువల్ల ఆచితూచి అడుగేయాలి. అలాగే ఇప్పుడంతా రాజీ రాజకీయాలు నడుస్తు న్నాయి. నేతలు తమ రాజకీయ వ్యూహాలకు పదను పెడుతున్నారు. ఒకప్పుడు ప్రతిపక్ష రాజకీయాలలో కీలక పాత్ర పోషించడంతో పాటు, ఎన్డీఏలో కూడా కీలక భాగస్వామిగా ఉండి, వాజపేయి ఏడేళ్లపాటు ప్రధానిగా ఉన్న సమయంలో ఎన్డీఎ కన్వీనర్‌గా ఉన్న చంద్రబాబు నాయుడు ఇప్పుడు రాజకీయంగా బలపడ్డార నే చెప్పాలి. జాతీయ స్థాయిలో బిజెపి చతికిలపడడంతో చంద్రబాబుకు కలసి పనిచేసే అవకాశం దక్కడం గమనార్హం. దీంతో మోదీ మళ్లీ ప్రధాని కావడంతో ఆయన ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఓ రకంగా చెప్పాలంటే చంద్రబాబు జాతీయ రాజకీయాల్లో మళ్లీ అడుగు పెట్టారనే చెప్పాలి. నితీశ్ కుమార్, చంద్రబాబు, చిరాగ్ పాశ్వాన్, అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండేలు బలంగా ఉన్నారు. ఈ కారణంగా మోడీ దేశహితం కోసం, ప్రజాసంక్షేమం కోరి నిర్ణయాలు తీసుకోవాలి. ఉమ్మడి నిర్ణయాలే అసవరం అవుతాయి. కలసి సాగాల్సిన సమయంలో పార్లమెంటులో ప్రజాస్వామ్యయుతంగా ఉండాల్సిందే. స్థానిక పరిస్థితులను బట్టి కాంగ్రెస్, బీజేపీతో సర్దుబాటు చేసుకోవడం ప్రాంతీయ పార్టీలకు కొత్త కాదు. అయితే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పడ్డ టిడిపిని కాంగ్రెస్‌తో జతకట్టేందుకు గతంలో చంద్రబాబు వెనకాడ లేదు. అయితే ఇక్కడ బిజెపి కూడా తన రాజకీయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాజకీయాలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడున్న పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుండా ముందుకు కదలని పరిస్థితి ప్రభుత్వానికి ఉంది. ప్రాంతీయ పార్టీలు రాష్ట్రాల అవసరాల కోసం ఎవరితోనైనా జతకడతారు. అందువల్ల మోడీ జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

# బడ్జెట్ పద్దులపైనే అందరి దృష్టి

**సంకీర్ణంలో కేటాయింపులపై సర్వత్రా చర్చ**

**నిర్మలమ్మ ఏకపక్ష నిర్ణయాలకు కాలం చెల్లినట్లే**

**న్యూఢిల్లీ,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

వరుసగా మూడోసారి కొలువుదీరిన మోదీ సర్కార్, ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై కసరత్తు ప్రారంభించింది. త్వరలో ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కాకుండా.. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ కసరత్తులో భాగంగా నార్త్‌బ్లాక్‌లోని ఆర్థిక శాఖ కార్యాలయంలో సందర్శకుల ప్రవేశంపై ఆంక్షలు ప్రారంభమయ్యాయి. సాధారణంగా ప్రతి ఏటా బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెడుతారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన 'ఓటాన్ అకౌంట్' బ్జడెట్ మాత్రమే ప్రవేశపెట్టాల్సి వచ్చింది. ఇది ఎన్నికలు ముగిసి, కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే వరకు మాత్రమే అమల్లో ఉంటుంది. ఎన్నికల తర్వాత వచ్చే ప్రభుత్వానికే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అధికారం ఉంటుంది. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ గెలుపొంది సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే 2014, 2019 మాదిరిగా బీజేపీకి సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ రాలేదు. గత రెండు పర్యాయాలు తాము కోరుకున్న రీతిలో బడ్జెట్‌ప్రవేశపెడుతూ వచ్చిన మోదీ సర్కారు, త్వరలో ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్‌పై గుత్తాధిపత్యం కొనసాగిస్తుందా లేక మిత్రపక్షాల డిమాండ్లకు చోటిస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. కొత్త ప్రభుత్వంలోనూ కీలకమైన ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మల సీతారామన్‌ను కొనసాగిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థికశాఖ మంత్రిగా ఆమె ఇప్పటికే 6 పర్యాయాలు బడ్జెట్ ప్రవేశపెట్టారు. బడ్జెట్ రూపకల్పన సందర్భంగా వివిధ వర్గాలతో సమావేశాలు నిర్వహించడం, వారి ఆకాంక్షలను తెలుసుకుని తదనుగుణంగా బడ్జెట్ తయారుచేయడం ఆనవాయితీ. ఆ ప్రకారం రైతు సంఘాల నుంచి వ్యాపారవర్గాల వరకు అందరినీ కలుస్తుంటారు. ప్రస్తుతం ఆ పక్రియ మళ్లీ మొదలైంది. అయితే బడ్జెట్‌పై కోటి ఆశలతో ఎదురుచూసేది మాత్రం వేతన



జీవులే. రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి సంపాదించిన సొమ్ములో ఆదాయపు పన్ను రూపేణా కేంద్ర ప్రభుత్వం ముక్కుపిండి వసూలు చేయడంతో పాటు పరోక్షంగా అనేక రూపాల్లో పన్నుల దాడికి గురవుతుంటారు. వందలు, వేల కోట్లు ఆర్జించే వ్యాపార, పారిశ్రామిక వర్గాల్లో చాలా వరకు తప్పుడు లెక్కలు చూపించి పన్ను ఎగవేస్తుంటారు. ఈ పరిస్థితుల్లో సామాన్య వేతన జీవులు ప్రభుత్వం తమపై మోపుతున్న పన్ను భారాన్ని తగ్గిస్తుందా అని ఆశగా ఎదురుచూస్తుంటారు. ఇప్పటికే 6 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మల సీతారామన్‌పై వేతన జీవులకు సదభిప్రాయం లేదు. ఈసారైనా తమపై కరుణచూపి పన్ను శ్లాబుల్లో మార్పుల రూపంలోనో.. లేక పన్ను మినహాయింపుల రూపంలోనో ఊరట కల్గిస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదే మాదిరిగా వ్యవసాయ, వ్యాపార, తయారీ రంగాలవారు కూడా ఈ బ్జడెట్ ద్వారా తమకు లభించే ప్రోత్సాహకాలు, పన్ను రాయితీల గురించి ఎదురు చూస్తుంటారు. దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే ప్రభుత్వం వద్ద దండిగా నిధులుండాలి. ప్రభుత్వ గడించే ఆదాయంలో పన్నులు, సుంకాల రూపంలోనే ఎక్కువగా ఉంటుంది. పన్ను రేట్లు తగ్గిస్తే ఆదాయం తగ్గుతుంది. ఆదాయం తగ్గితే అభివృద్ధి తగ్గుతుంది. కాబట్టి ఇదొక అంతులేని కథలా కొనసాగుతుంది.మరోవైపు లోక్‌సభతో పాటు రాజ్యసభ 264వ సెషన్ జూన్ 27 నుంచి ప్రారంభమవుతుంది. అంటే లోక్‌సభ తొలి రెండు రోజులు సభ్యుల ప్రమాణ స్వీకారం, మూడో రోజు స్పీకర్ ఎన్నిక పూర్తిచేసిన తర్వాత రాజ్యసభ మొదలవుతుంది. అదే రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం ఉంటుందని పార్లమెంట్ వర్గాలు వెల్లడించాయి. ప్రతియేటా బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగించారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ నేపథ్యంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే రాష్ట్రపతి ప్రసంగం ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రసంగం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఏం చేయదల్చుకుందో చెప్పే ప్రయత్నం చేస్తుంది.

# స్పీకర్ పదవిపై అంతా గుంభనం

**పార్లమెంట్ సమావేశాల ముందే స్పష్టత**

**విపక్షాలకు ఇచ్చేందకు సిద్దంగా లేని బిజెపి**

**న్యూఢిల్లీ,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

దేశ ప్రధానిగా మూడవసారి నరేంద్ర మోదీ మొత్తం 72 మంది మంత్రులతో కలసి ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణస్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. త్వరలోనే పార్లమెంట్ సమావేశాలు జరుగనున్న వేళ లోక్‌సభ స్పీకర్ ఎవరన్న చర్చ వస్తోంది. మంత్రివర్గ కూర్పు సమయంలో బిజెపి మహిళా ఎంపి పురందేశ్వరి పేరు చర్చకు వచ్చింది. కానీ ఎలాంటి చర్చా జరగడం లేదు. ఇప్పుడు రాజకీయ వర్గాల్లో సర్వత్రా వినిపిస్తున్న ఆసక్తికరమైన ప్రశ్న లోక్‌సభ స్పీకర్ ఎవరన్నదే. మోదీ ప్రభుత్వ ఏర్పాటులో కింగ్ మేకర్‌లుగా ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు,జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ఇద్దరూ లోక్‌సభ స్పీకర్ పదవిని ఆశిస్తున్నారంటూ జాతీయ మీడియాలో కథనాలు వెలువడు తున్నాయి. అయితే అత్యంత కీలకమైన ఈ పదవిని ఇతరులకు ఇచ్చేందుకు బీజేపీ ముందుకు రాకపోవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఎన్‌డిఎ హయాంలో వాజ్‌పేయ్ ప్రధానిగా ఉన్న సమయంలో జిఎంసి బాలయోగి స్పీకర్‌గా ఉన్నారు. అయితే అప్పటికీ ఇప్పటికీ రాజకీయాలు మారాయి. ఇప్పుడు ఇతర పార్టీలకు స్పకీర్ పదవి ఇస్తే బిజెపి పట్టు కోల్పోతుందన్న వాదన ఉంది. భారత రాజ్యాంగం ప్రకారం లోక్‌సభ తొలి సమావేశానికి ముందు స్పీకర్ పదవి ఖాళీగా ఉంటుంది. అయితే భారత రాష్ట్రపతి ప్రొటెం–స్పీకర్‌ను నియమిస్తారు. కొత్త ఎంపీల చేత ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం సభలో సాధారణ మెజారిటీతో లోక్‌సభ స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. స్పీకర్ ఎన్నికకు ప్రత్యేక నిబంధనలు ఏవీ లేకపోయినా.. రాజ్యాంగం, పార్లమెంటరీ రూల్స్‌ను దృష్టిలో ఉంచుకొని స్పీకర్ ఎన్నికను నిర్వహించాలి. గత రెండు లోక్‌సభల్లో బీజేపీకి స్పష్టమైన అధికారం ఉండడంతో తొలిసారి సుమిత్రా మహాజన్, ఈతరవాత ఓం బిర్లా సాధారణ మెజారిటీతో ఎన్నికయ్యారు. ఇప్పుడు ప్రభుత్వంలో కీలకంగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ ఇద్దరూ రాజకీయ అనుభవజ్ఞులు. సంకీర్ణ సర్కారు నిర్వహణలో దిట్టలు. రాజకీయ సంక్షోభాల సమయంలో స్పీకర్ పదవి ఎంతటి కీలకమైనదో బాగా అవగాహన ఉన్న నేతలు. సంకీర్ణ ప్రభుత్వాల్లో స్పీకర్ పదవి కీలకమైనదిగా రాజకీయ విశ్లేషకులు చెబుతుంటాయి. ఈ విషయాన్ని గ్రహించే ఇద్దరూ లోక్‌సభ పదవిని కోరుతున్నారు. స్పీకర్ విలువపై బాగా అవగాహన కల్పించేలా గత రెండేళ్లుగా పలు రాష్ట్రాల్లో పాలక పక్షంలో తిరుగుబాట్లు వచ్చిన విషయం తెలిసిందే. అంతర్గత తిరుగుబాట్లు పార్టీల్లో చీలికలకు దారితీసిన పరిస్థితులు.. ప్రభుత్వాలు కుప్పకూలిన విషయాలు విదితమే. ఇటువంటి సందర్భాలలో స్పీకర్ పదవి చాలా కీలకంగా మారుతుంది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం చట్టం కింద సభ్యులపై అనర్హత వేటు వేసే శక్తిమంతమైన హక్కు సభాపతికి ఉంటుంది. ఈ మేరకు స్పీకర్‌కు సంపూర్ణ అధికారం ఉంటుంది. మరోవైపు తన పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ ప్రయత్నిచ్చిందంటూ గతంలో నితీశ్ కుమార్ ఒకసారి ఆరోపించారు. అటువంటి పరిస్థితుల్లో స్పీకర్ పదవి చక్కటి అస్త్రమని భావిస్తుంటారు. ఈ కారణంగానే కింగ్‌మేకర్‌లుగా టీడీపీ, జేడీయూ పార్టీలు అత్యంత వ్యూహాత్మకంగా లోక్‌సభాపతి స్థానాన్ని ఆశిస్తుండ వచ్చునని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. పార్లమెంటరీ వ్యవస్థలో లోక్‌సభ స్పీకర్ పదవి చాలా కీలకమైనది. సభను నడిపే వ్యక్తిగా స్పీకర్ పార్టీలకతీతంగా పారదర్శకంగా వ్యవహరించాలి. ఒక నిర్దిష్ట పార్టీకి చెందిన వ్యక్తే అయినప్పటికీ స్పీకర్‌గా ఎన్నికైన తర్వాత మాత్రం అన్ని పార్టీలను సమానంగా చూడాలి. సభలో అందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలి. నాలుగో లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన తర్వాత కాంగ్రెస్ దిగ్గజం నీలం సంజీవ రెడ్డి పారదర్శకంగా నడుచుకునేందుకుగానూ ఏకంగా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఎవరూ ఈ విధంగా తమ పార్టీలకు రాజీనామా చేయలేదు. అయితే పీఏ సంగ్మా, సోమనాథ్ ఛటర్జీ, మీరా కుమార్ వంటి ఇతర మాజీ స్పీకర్లు అధికారికంగా పార్టీకి రాజీనామా చేయకపోయినప్పటికీ తాము సభకు సంబంధించినవారమని, పార్టీకి చెందిన వ్యక్తులం కాదని తెగేసి చెప్పారు. కాగా 2008లో లోక్‌సభ స్పీకర్ విషయంలో ఆసక్తికరమైన పరిణామాం జరిగింది. యూపీఏ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం సందర్భంగా పార్టీ సూచనలను పట్టించుకోలేదనే కారణంగా నాటి స్పీకర్ సోమనాథ్ ఛటర్జీని సీపీఎం పార్టీ నుంచి బహిష్కరించింది. ఈ క్రమంలో స్పీకర్ పదవి అవకాశం వచ్చినప్పుడు బలంగా ఉంటుంది. అందుకే సంకీర్ణ సమయాల్లో ఇది చాలా ముఖ్యం. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొత్తగా ఎన్నికైన లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక కోసం పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమవుతుంది. ఈ ప్రత్యేక సమావేశాలు జూన్ 24న ప్రారంభమై జులై 3న ముగుస్తున్నాయి. తొలి రెండు రోజులు కొత్త ఎంపీల ప్రమాణ స్వీకారంతోనే సరిపోతుంది. మొత్తం 543 మంది సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. సభలో సీనియర్ సభ్యుడిని రాష్ట్రపతి ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తారు. 18వ లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల్లో మధ్యప్రదేశ్‌లోని తికంగఢ్ స్థానం నుంచి బీజేపీ తరఫున గెలుపొందిన వీరేంద్ర కుమార్, కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపీ కొడిక్కున్నిల్ సునీల్ సీనియర్ సభ్యులుగా ఉన్నారు. ఇద్దరూ 8 పర్యాయాలు లోక్‌సభకు గెలుపొందారు. అయితే వీరిలో వీరేంద్ర కుమార్‌ను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకున్నందున కాంగ్రెస్ సభ్యుణ్ణి ప్రొటెం స్పీకర్‌గా తీసుకుంటారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నికల జరగనుంది. ఈ పదవి కోసం రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీగా ఉన్న దగ్గుబాటి పురందేశ్వరి పేరు రేసులో వినిపిస్తోంది. కేంద్ర మంత్రివర్గంలో ఆమెకు చోటు కల్పించలేదు కాబట్టి 'నారీశక్తి' నినాదంలో భాగంగా ఆమెకు స్పీకర్ పదవి కట్టబెట్టే అవకాశం ఉందన్న విశ్లేషణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే అనూహ్య నిర్ణయాలు తీసుకునే మోదీ–షా ద్వయం ఈసారి స్పీకర్‌గా ఎవరికి అవకాశం కల్పిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## కేంద్రంలో ఉన్నది కిచిడీ ప్రభుత్వం

**అది ఎప్పడైనా కూలిపోవచ్చు**

**మరోమారు అక్కసు వెళ్లగక్కిన ఖర్గే**

**న్యూఢిల్లీ,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

నరేంద్ర మోదీ సారథ్యంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం పొరపాటున అధికారంలోకి వచ్చిందని, అది త్వరలోనే కుప్పకూలుతుందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మరోమారు అన్నారు. శనివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు మోదీ మైనారిటీ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని, అది ఏ సమయంలోనైనా కూలిపోవచ్చని అన్నారు. 'కేంద్రంలో బలహీనమైన, కిచడీ ప్రభుత్వం ఉంది. పేకముక్కల్లా ఎప్పుడైనా కుప్పకూలొచ్చు. అయితే ఎప్పుడు అనేదే ప్రశ్న. ఏం జరుగుతుందో చూద్దాం అని ఖర్గే పేర్కొన్నారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం కూలిపోవచ్చని మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యానించడం ఇదే మొదటిసారి కాదు. ఎన్నికల ఫలితాల అనంతరం కూడా సరైన సమయంలో సరైన నిర్ణయాన్ని 'ఇండియా' కూటమి తీసుకుంటుందని చెప్పారు. ఇటీవల వెలువడిన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 240 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా నిలిచింది.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## కెసిఆర్ రాజకీయంగా దెబ్బతిన్నట్లే

- కాలు ముందుకు పెట్టేలని దుస్థితి

హైదరాబాద్,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):

కేసీఆర్ నైతికంగా బలహీనపడిపోయారు. కూతరు కవిత లిక్కర్ స్కామ్, ధరణి వ్యవహారం, ఫోన్‌ట్యాపింగ్, కాళేశ్వరం, విద్యుత్ ఒపపందాల విచారణ వంటివి ఇప్పుడు మెడకు చుట్టుకుంటున్నాయి. రాష్ట్రంలో ఆయన బలమైన నాయకుడే అయినా, ఆ బలం జాతీయ స్థాయిలో నాయకుడిగా ఎదగడానికి ఉపయోగ పడలేదు. నితీశ్ కుమార్, అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ లాంటి వారు ఉత్తరాదికి చెందిన వారు కావడంతో వారికి వచ్చిన గుర్తింపు కెసిఆర్÷–కు రావడం లేదు. కెసిఆర్ స్వయంకృతం కూడా ఇందుకు కారణం. అవినీతి వ్యవహారాలను నడిపిన కారణంగా ఓటమి చెందడంతో ఇప్పుడు ఆయనపై ఉన్న భ్రమలు తొలగిపోయాయి. కేసులు చుట్టుముడుతున్నాయి. ఇవన్నీ తూచ్ అని తీసి పారేయడానికి లేదు. నైతిక పతనమే ఇందుకు కారణం. తెలంగాణలో తానేం చేసినా చెల్లుబాట వుతుందని నమ్మడం వల్లనే ఆయన ఎప్పటికప్పుడు నాలుక మడతేసారు. ప్రాంతీయ పార్టీల నాయకులు ఒకప్పుడు రాష్ట్ర ప్రయోజనాల కోసం పాకులాడేవారు. ఇప్పుడు స్వప్రయోజనాల కోసం దేబిరించే పరిస్థితికి చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముందు మోకరిల్లితే చాలు స్వరాష్ట్రాలలో ఎన్ని తప్పులైనా చేయవచ్చు, ఎంత నిరంకుశంగానైనా పాలించవచ్చు అన్న ధోరణి ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రబలుతోంది. కేసీఆర్ ఇందుకు మినహాయింపు అని నిన్నటివరకు అమాయకంగా నమ్మినవాళ్లు ఇప్పుడు ఆశ్చర్యపోతున్నారు. ఉద్యమ పార్టీలు నైతికంగా పతనం కావడం కొత్త కాదు. బిహార్ నుంచి ఝార్ఖండ్ రాష్ట్రం విడివడటానికి కారణమైన ఝార్ఖండ్ ముక్తి మోర్చా గురించి తెలిసిందే. ఇప్పుడు బీఆర్ఎస్ వంతు వచ్చింది. ఇక మీదట జాతీయ రాజకీయాలలో అది చేద్దాం, ఇది చేద్దాం అని కేసీఆర్ అన్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవచ్చు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో ప్రతిపక్షాల ఐక్యత అని పర్యటించిన కేసీఆర్, ఇకపై కాలు బయట పెట్టకపోవచ్చు. ఎవరెవరినో రప్పించుకుని బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు ప్రకటనలు చేసినా అదంతా ఉత్తిదే అని ఎన్నికల్లో ప్రజలు తీర్పును ఇచ్చారు. మొత్తంమీద కేసీఆర్ రాజకీయాల్లో రాటుదేలడం కాదుకదా, తట్టుడు రాయికే పడిపోయాడు.

## కాలాన్ని వశం చేసుకోవడం దుర్లభం ! (ఆధ్యాత్మిక చింతన)

తిరుమల,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):

కాలం భగవంతుని స్వరూపం. ఈ సష్టిలో అత్యంత బలమైనది కాలమే. కాలానికి సమస్త జీవరాశీ వశపడవలసిందే. కాలానికి లొంగకుండా బతకగలిగినది ఈ సృష్టిలో ఏదీ లేదు. అందుకే శ్రీ మద్ రామాయణంలో కాలం గురించి చెబుతూ...' కాలోహి దురతి క్రమః' అంటారు మహర్షి. అంటే ..కాలాన్ని దాటడం, తనకు వశం చేసుకోవడం, దాన్ని కదలకుండా చేయగలగడం...లోకంలోఎవరికీ సాధ్య పడదు?అని. సాధారణ సిద్దాంతంలో అందరూ కాలానికి వశపడవలసిందే.కాలంలో పుడతారు, కాలంలో పెరుగుతారు, కాలంలోనే శరీరాన్ని విడిచి పెడతారు. అందరూ కాలానికి వశపడి ఉంటారు. కానీ ఎవడు భగవంతుడిచ్చిన జీవితం అనబడే ఈ శరీరంతో ఉండగలిగిన కాలాన్ని సద్వినియోగం చేసుకుంటాడో వాడు తన శరీరాన్ని విడిచి పెట్టేసిన తరువాత కూడా కీర్తి శరీరుడిగా నిలబడిపోతాడు. ఆయనకి కీర్తే శరీరం అవుతుంది. ఆయన కాలంతో సంబంధం లేకుండా యుగాలు దాటిపోయినా కూడా కొన్ని కోట్ల మందికి ప్రేరణగా అలా నిలబడిపోతాడు. అందుకే మనుష్యుని జీవితంలో అన్నిటికన్నా అత్యంత ప్రధానమైనదిగా చెప్పబడేది ? కాలం విలువను గుర్తించడం. ఆ కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం. ఎవడు కాలం విలువని గుర్తించలేడో ఎవడు కాలాన్ని సద్వినియోగం చేసుకోలేదో వాడు కాలగర్భంలో కలిసిపోతాడు. ఆ జీవితం ఏ విధంగా కూడా ఉపయోగకరం కాదు. తనను తాను ఉద్ధరించుకోవడానికిగానీ, మరొకరిని ఉద్ధరించడానికిగానీ పనికిరాడు.

## స్పందనకు సరికొత్త రూపం

- ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికగా మార్పు
- ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత
- మంగళగిరి ప్రజల కోసం లోకేశ్ ప్రత్యేక ఏర్పాట్లు

అమరావతి,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పాటైన తెదేపా ప్రభుత్వం వ్యవస్థల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గతంలో స్పందన పేరిట చేపట్టిన వ్యవస్థలో పూర్తిస్థాయి మార్పులు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 'స్పందన' పేరును తొలగించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థగా కొనసాగించాలని ఉత్తర్వులను జారీ చేసింది. ఇక నుంచి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టమ్ పేరుతో ఫిర్యాదుల స్వీకరణ చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రజలకు మరింత అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. కలెక్టరేట్లలో ప్రతి సోమవారం కలెక్టర్లు, అధికారులు ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ తక్షణమే అమలుకు సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలావుంటే మంగళగిరి ప్రజల కోసం 'ప్రజా దర్బార్' నిర్వహించినట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా చాలా సేవా కార్యక్రమాలు చేశామన్నారు. భారీ మెజార్టీతో గెలిచిన తనపై బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో అందుబాటులో ఉన్న రోజుల్లో ప్రజలను కలుస్తామని చెప్పారు. ఉదయం 8 గంటలకు ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసినట్లు వివరించారు. నారా లోకేశ్ మంగళగిరి ప్రజల కోసం ఉండవల్లిలోని నివాసంలో ఉదయం 8 గంటల నుంచి 'ప్రజా దర్బార్' నిర్వహించారు. దీంతో సమస్యలు విన్నవించేందుకు నియోజకవర్గ ప్రజలు తరలివచ్చారు. వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామని లోకేశ్ వారికి హామీ ఇచ్చారు. ఆయా విభాగాల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇకపోతే పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కు ఇకపై తరచూ పార్టీ కార్యలయానికి వెళ్లేలా చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేశారు. పార్టీ కార్యాలయంలో మంత్రులు కూడా అందుబాటులో ఉండేలా కార్యాచరణ చేశారు. పార్టీ – ప్రభుత్వం మధ్య సమన్వయానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు.

# చట్టబద్ధంగానే విద్యుత్ కొనుగోళ్లు

- తెలంగాణలో నిరంతర విద్యుత్ కోసం కృషి
- ఈఆర్‌సి నిబంధనలు కాదని కమిషన్ వేయడం చట్టవిరుద్ధం
- మా ప్రభుత్వానికి దురుద్దేశాలు అంటకట్టే ప్రయత్నాలు సరికాదు
- కమిషన్ ముందుకు వచ్చి వివరణ ఇవ్వాల్సిన పనిలేదు
- వీలైతే మీరు రాజీనామా చేసి వెళ్లిపోండి
- జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్‌కు కేసీఆర్ లేఖ

హైదరాబాద్,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):

విద్యుత్ కొనుగోలు, పవర్ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో అన్ని రకాల చట్టాలు, నిబంధనలు పాటిస్తూ ముందుకెళ్లామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర అనుమతులు సాధిస్తూ ముందుకెళ్లామని చెప్పారు. ఈఆర్‌సీ సంస్థలు వెలువరించిన తీర్పులపై కమిషన్లు వేయకూడదన్న విషయం కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. కమిషన్ చట్టవిరుద్ధమని ప్రభుత్వానికి సూచించకుండా బాధ్యతలు స్వీకరించడం విరుద్ధమని చెప్పారు. రాజకీయ కక్షతోనే విచారణ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. విద్యుత్ కొనుగోలు విషయంలో జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్‌కు కేసీఆర్ వివరణ ఇచ్చారు. ఈమేరకు కమిషన్‌కు 12 పేజీల లేఖ రాశారు. 'రాష్ట్రం ఏర్పడినప్పుడు విద్యుత్ రంగం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. కరెంటు సరిగా లేక లక్షలాదిగా వ్యవసాయ పంపుసెట్లు కాలిపోయిన పరిస్థితి. పారిశ్రామిక రంగంలో ప్రతి వారంలో కొన్ని రోజులు పవర్ హాలిడే ప్రకటించారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు ఇచ్చిన కరెంటు ఏమాత్రం సరిపోదు. తెలంగాణ విద్యుత్ పంపిణీ వ్యవస్థ పటిష్ఠానికి నిర్మాణాత్మక చర్యలు తీసుకున్నాం. అన్ని రకాల అనుమతులు పొంది మందుకు పురోగమించడం జరిగింది. రాజకీయ కక్షతో తనను, అప్పటి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేయడానికే కమిషన్ వేశారు. మా ప్రభుత్వం గణనీయ మార్పుతో కరెంటు ఇచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. మా మార్పును తక్కువ చూపించేందుకే ప్రభుత్వ ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. పత్రికా విలేకఖరుల సమావేశంలో కమిషన్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడింది. విచారణ అనేది ఒక పవిత్రమైన బాధ్యత. ఇరుపక్షాల మధ్య మధ్యవర్తిగా నిలిచి నిజాలు నిగ్గుతేల్చాలి. అన్ని కోణాల్లో సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు వెల్లడించాలి. గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా రిపోర్టు ఇవ్వాలని మాట్లాడుతున్నట్లుంది. ఇప్పటికే నష్టం జరిగినట్లు.. ఆర్థిక నష్టాన్ని లెక్కిస్తున్నట్లు మీ మాటలు ఉన్నాయి. మీ విచారణలో నిష్పాక్షికత ఎంతమాత్రం కనిపించట్లేదు. నేను మీ ముందు హాజరై ఏం చెప్పినా ప్రయోజనం ఉండదు. మేం చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుని వైదొలిగితే మంచిది. మీరు కమిషన్ బాధ్యల నుంచి వైదొలగాలని వినయ పూర్వకంగా కోరుతున్నా' అంటూ కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. పరిస్థితులను గమనించే నాటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విద్యుత్తు అవసరాల దృష్ట్యా విభజన చట్ట ప్రకారం తెలంగాణకు ఇచ్చిన కరెంటు ఎంతమాత్రం సరిపోదు. 2014 నాటి వినియోగాన్ని బట్టి దాదాపు 2,700 మెగావాట్ల కొరత ఉంది.నాటి ఆంధ్రప్రదేశ్ కరెంట్ సరఫరాను ఎగవేయడం వల్ల 1,500 మెగావాట్లు, గ్యాస్ ఆధారిత విద్యుత్తు రాకపోవడం వల్ల 900 మెగావాట్లు కలిపి మరో 2,400 మెగావాట్ల లోటు ఏర్పడింది. మొత్తమ్మీద సుమారు 5,000 మెగావాట్ల కొరతతో తెలంగాణలోని విద్యుత్తు రంగంలో తీవ్ర సంక్షోభం ఏర్పడింది. విద్యుత్తు సంక్షోభం నుంచి గట్టెక్కడానికి శాశ్వత ప్రయోజనాలు కోసం విద్యుత్తు పంపిణీ వ్యవస్థను పటిష్ఠపరచాం. ఫలితంగానే రాష్ట్రం ఆవిర్భవించినప్పుడు 7,778 మెగావాట్లుగా ఉన్న రాష్ట్ర స్థాపిత విద్యుత్తు, తర్వాత సుమారు 20,000 మెగావాట్లపైచిలుకుకు చేరింది. దేశంలోనే నాణ్యమైన నిరంతరాయ కరెంటు అన్ని రంగాలకూ సరఫరా చేసిన ఏకైక రాష్ట్రంగా మారింది. 2014 నాటికి తెలంగాణ తలసరి విద్యుత్తు వినియోగం 1,196 యూనిట్లు ఉండగా, పదళ్లలో అది 2,349 యూనిట్లకు పెరిగింది. ఈ విజయాలు ఆషామాషీగా సాధించలేదు. విద్యుత్తు కొనుగోళ్ల విధానంలో, నూతన విద్యుదుత్పత్తి కేంద్రాల ఏర్పాటులో చట్టాలను, నిబంధనలను పాటించాం. ఎలక్ట్రిసిటీ యాక్ట్ 2003ను అనుసరిస్తూ అవసరమైన అన్ని రకాల అనుమతులను పొంది ఎస్.ఇ.ఆర్.సి తీర్పులకు లోబడే చర్యలూ తీసుకున్నాం. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఇ.ఆర్.సిలో ఫిర్యాదు చేయవచ్చు. దీనిపై తీర్పు నచ్చకుంటే అప్పిలేట్ ట్రైబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చు. ఛత్తీస్‌గఢ్ నుంచి రాష్ట్ర విద్యుత్తు సంస్థలు కరెంటు కొనుగోలు చేయడంపై నాటి తెలుగుదేశం ఎమ్మెల్యేగా రేవంత్ రెడ్డి తెలంగాణ ఇ.ఆర్.సికి అభ్యంతరాలు చెప్పారు. వాటిని పరిశీలించిన తర్వాతే తెలంగాణ విద్యుత్తు సంస్థలు చేసిన ప్రతిపాదనలకు ఇ.ఆర్.సి. ఆమోదముద్ర వేసింది. అప్పుడు అభ్యంతరం ఉండి ఉంటే అప్పిలేట్ ట్రైబ్యునల్ కు లేదా ఇతర కోర్టులకు వెళ్లే స్వేచ్ఛ ఉంది. కానీ ఆయన ఆనాడు ఎలాంటి అప్పీలుకూ వెళ్లిన దాఖలాలు చేయలేదు. రేవంత్రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యుత్తు విజయాలను సాధించిన గత ప్రభుత్వానికి దురుద్దేశాలను ఆపాదిస్తూ శ్వేతపత్రాలు విడుదల చేశారు. వాటిపై చర్చలు జరిగాయి. రెగ్యులేటరీ సంస్థల తీర్పులపై విచారణ చేయొద్దన్న ఇంగితం లేకండా కమిషన్ ఏర్పాటు చేశారు. హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన వ్యక్తి కూడా న్యాయ ప్రాధికార సంస్థల తీర్పులపై ఎంక్వైరీ చేయొద్దని సూచించకుండా బాధ్యతలు స్వీకరించడం విచారకరం. చట్టవిరుద్ధంగా విచారణ ప్రారంభించి, అనేక విషయాలను సమగ్రంగా పరిశీలించకుండానే, పరిగణనలోకి తీసుకోకుండానే పలు అంశాలపై అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారు. వాటిపై నా అభ్యంతరాలను మీకు తెలియజేస్తున్నానని కెసిఆర్ తన లేఖలో వివరించారు.

# తెలంగాణలో భారీగా కలెక్టర్ల బదిలీలు

**పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం**

హైదరాబాద్,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):

తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ జరిగింది. 20 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్దిరోజులకు తాత్కాలిక బదిలీలు జరిపింది. గత ప్రభుత్వ హయాంలో పలు స్థానాల్లో ఉన్నవారిని మార్చింది. అనంతరం లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో బదిలీలు నిలిచిపోయాయి. ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం పాలనాపరమైన ప్రక్షాళనలో భాగంగా పెద్దఎత్తున మార్పులు చేసింది. వివిధ జిల్లాల కలెక్టర్లను బదిలే చేస్తూ కొత్తవారిని నియమిస్తూ ఆదేశాలు ఇచ్చింది. బదిలీ అయిన కలెక్టర్ల వివరాలు ఇలావున్నాయి. ఖమ్మం: ముజామిల్ ఖాన్, నాగర్‌కర్నూల్: సంతోష్, భూపాలపల్లి: రాహుల్‌శర్మ, కరీంనగర్: అనురాగ్ జయంతి, పెద్దపల్లి: కోయ శ్రీహర్ష, జగిత్యాల: సత్యప్రసాద్, మంచిర్యాల: కుమార్ దీపక్, మహబూబ్‌నగర్: విజయేంద్ర, హనుమకొండ: ప్రావీణ్య, నారాయణపేట్: సిక్తా పట్నాయక్, సిరిసిల్ల: సందీప్‌కుమార్ ఝా, భద్రాద్రి కొత్తగూడెం: జితేష్ వి పాటిల్, వికారాబాద్: ప్రతీక్ జైన్, కామారెడ్డి: ఆశిష్ సంగ్వాన్, నల్గొండ: నారాయణరెడ్డి, వనపర్తి: ఆదర్శ్ సురభి, సూర్యాపేట కలెక్టర్: తేజస్ నందలాల్ పవార్, వరంగల్: సత్య శారదాదేవి, ములుగు: దివాకరా, నిర్మల్: అభిలాష అభినవ్ ఉన్నారు.

ఈ బదిలీల్లో పలువురు కలెక్టర్లను మార్చారు. సుమారుగా 20 జిల్లాలకు కలెక్టర్లను బదిలీ చేశారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్‌ను ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా, మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా, ట్రాన్స్‌కో జేఎండీ సందీప్ కుమార్ ఝాను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా, అనురాగ్ జయంతిని కరీంనగర్ జిల్లా కలెక్టర్గా, నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను కామారెడ్డిజిల్లా కలెక్టర్‌గా, జితేష్ వి పాటిల్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా, రాహుల్ శర్మను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా, హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా, పీ ప్రావీణ్యను వరంగల్ జిల్లా కలెక్టర్ నుంచి హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా, సత్యప్రసాద్‌ను ఖమ్మం అదనపు కలెక్టర్ నుంచి జగిత్యాల కలెక్టర్‌గా బదిలీ చేశారు. కోయ శ్రీహర్షను పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా, విజయేంద్ర బోయిని మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా, కుమార్ దీపక్‌ను మంచిర్యాల కలెక్టర్‌గా, ప్రతీక్ జైన్‌ను వికారాబాద్ కలెక్టర్‌గా, నారాయణరెడ్డి వికారాబాద్ కలెక్టర్‌గా, ఆదర్శ సురభిని వనపర్తి జిల్లా కలెక్టర్‌గా, తేజస్ నంద్‌లాల్‌ను సూర్యాపేట జిల్లా కలెక్టర్‌గా, సత్య శారదాదేవిని వరంగల్ జిల్లా కలెక్టర్‌గా, దివాకర్‌ను ములుగు జిల్లా కలెక్టర్‌గా, అభిలాష అభినవ్‌ను నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

# 18న వారణాసిలో మోడీ పర్యటన

- కిసాన్ సమ్మాన్ నిధులు అదేరోజు విడుదల
- కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడి

న్యూఢిల్లీ,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 18న వారణాసిలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి స్కీమ్ 17వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.20,000 కోట్లు విడుదల చేయదలనున్నారు. అనంతరం 30,000 సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. శనివారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ సమన్వయంతో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కరేంద్రమోదీ జూన్ 10న మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తూ పీఎం కిసాన్ నిధి 17వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.20,000 కోట్లు విడుదల చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తద్వారా 9.3 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభించిన ఈ పథకం కింద రైతుల ఆధార్ సీడెడ్ బ్యాంక్ అకౌంట్లకు నేరుగా రూ.6,000 వార్షిక మొత్తంగా జమ అవుతుంది. ఒక్కో ఇన్‌స్టాల్‌కు రూ.2,000 చొప్పున మూడు



ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా ఈ మొత్తాన్ని జమచేస్తారు. కాగా, 17వ ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ.20,000 కోట్లు విడుదల చేసే కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 2.5 కోట్ల మంది రైతులు పాల్గొంటారని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. వారణాసిలో ప్రధాని 'సింగిల్ క్లిక్'తో బటన్ నొక్కిన వెంటనే 9.26 కోట్ల మంది రైతు లబ్దిదారులకు ఆ మొత్తం చేరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులను చైతన్యవంతులను చేసేందుకు దేశవ్యాప్తంగా 732 కృషి విజ్ఞాన్ కేంద్రాలు, లక్షకు పైగా ప్రైమరీ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీలు, 5 లక్షల కామన్ సర్వీస్ సెంటర్లు పాల్గొంటాయని మంత్రి తెలిపారు.



# ప్రియుడి మోజులో భర్త హత్య

- సుపారీ ఇచ్చి హత్య చేయించిన భార్య
- ఆదిలాబాద్ టీచర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

**ఆదిలాబాద్,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

జిల్లాలో ప్రభుత్వ టీచర్ హత్య కేసులో సంచలన విషయాలు బయట కొచ్చాయి. ప్రియుడి మోజులో పడిన భార్యనే సుఫారీ ఇచ్చి భర్తను దారుణంగా హత్య చేయించినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. భార్య కదలికలపై అనుమానం వచ్చి ఆమె సెల్ఫోన్ను చెక్ చేయగా ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. భర్త స్కూలుకు వెళ్లగానే ప్రియుడిని ఇంటికి పిలిపించుకుని ఎంజాయ్ చేయడం, వాటిని ఫోన్లో ఫొటోలు తీసుకున్నట్లుగా కూడా గుర్తించారు. ఇప్పుడు ఆ ఫొటోలు సోషల్మీడియాలో వైరల్గా కూడా మారాయి. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం నాగులకొండకు చెందిన గజేందర్.. జైనథ్ మండలం కెనాల్ మేడిగూడలో గవర్నమెంట్ టీచర్గా పని చేస్తున్నాడు. భార్య విజయలక్ష్మితో కలిసి సంతోషంగా జీవిస్తున్నాడు. అయితే మహేశ్ అనే యువకుడితో విజయలక్ష్మి అక్రమ సంబంధం పెట్టుకుంది. భర్త ఉద్యోగానికి వెళ్లిపోగానే ప్రియుడితో కలిసి షికార్లు చేసేది. అతనితో ఎంజాయ్ చేస్తూ.. వాటిని ఫొటోలు తీసి మధుర జ్ఞాపకాలుగా ఫోన్లోనే దాచి పెట్టుకుంది. అయితే కొద్దిరోజులుగా వేసవి సెలవులు ఉండటంతో వాళ్లిద్దరూ కలుసుకోవడానికి కుదరలేదు. దీంతో భర్త ఉంటే ఎప్పటికైనా తమకు అడ్డే అని భావించిన విజయలక్ష్మి అతన్ని హత్య చేయాలని భావించింది. ప్రియుడితో కలిసి భర్త మర్డర్కు స్కెచ్ వేసింది. ఒక సుపారీ గ్యాంగ్ను కూడా సంప్రదించి.. తన భర్త గురించి పూర్తి వివరాలను వెల్లడించింది. స్కూల్ రీఓపెన్ రోజున ప్లాన్ చేసి గజేందర్ను చంపేశారు. ఆ తర్వాత ఏం తెలియనట్టుగా విజయలక్ష్మి తన భర్త కనిపించడం లేదని గజేందర్ భార్య విజయలక్ష్మి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఇంతలో గాదేగూడ మండలం పర్సువాడ వద్ద జూన్ 12వ తేదీన ఒక మృతదేహం అనుమానాస్పద రీతిలో కనిపించింది. దీంతో గజేందర్ను ఎవరు హత్య చేసి ఉంటారని పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో విచారణ చేస్తున్న పోలీసులకు భార్య విజయలక్ష్మి కదలికలపై అనుమానం వ్యక్తమైంది. దీంతో ఆమె సెల్ఫోన్ స్వాధీనం చేసుకుని కాల్ డేటాను పరిశీలించారు. ఆ ఫోన్లో ఉన్న ఫొటోలను కూడా చూసి షాకయ్యారు. ప్రియుడి కోసమే భర్తను హత్య చేయించిందని పోలీసులు నిర్ధారించారు. ప్రియుడు మహేశ్తో పాటు విజయలక్ష్మిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

# విజయవాడ-ముంబై మధ్య డైరెక్ట్ ఫ్లైట్

- సర్వీస్ ప్రారంభించిన ఎయిర్ ఇండియా
- వెల్లడించిన ఎంపి బాలశౌరి

**అమరావతి,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

విజయవాడ నుంచి ముంబైకు - ముంబై నుంచి విజయవాడకు ఎయిర్ ఇండియా డైరెక్ట్ ÷÷-లట్ సర్వీసులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయని ఎంపీ బాలశౌరి తెలిపారు. ముంబై నుంచి విజయవాడకు 5.45 గంటలకు.. విజయవాడ నుంచి 7.10 గంటలకు ముంబైకు విమాన సర్వీసులు ప్రారంభించినట్లు వివరించారు. విజయవాడ నుంచి అనేక ప్రాంతాలకు వెళ్లే వారిని కనెక్టింగ్ ఫ్లైట్గా ఇది ఉపయోగపడుతుందన్నారు. వేరే దేశాల నుంచి వచ్చే ప్యాసింజర్లు ముంబై ద్వారా విజయవాడ రావడం సులభం అవుతుందని చెప్పారు. ఎయిర్ ఇండియాకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. విజయవాడ నుంచి అనేక ప్రాంతాలకు కనెక్టివిటీ పెరగాలని కోరారు. విజయవాడ నుంచి వారణాసికి వారానికి రెండు రోజులు విమాన సర్వీస్ ఉండేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. విజయవాడ నుంచి కలకత్తాకు, షిరిడీ ÷÷-లట్లు కోసం కృషి చేస్తామని ఉద్ఘాటించారు. విజయవాడ నుంచి గతంలోగా సింగపూర్, థాయ్ లాండ్కు సర్వీసులు పునరుద్ధరించేందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్లు కృషి చేస్తున్నారని అన్నారు. కొత్త టెర్మినల్ గత కాంట్రాక్టర్ చాలా ఆలస్యం చేస్తున్నారని.. సివిల్ ఏవియేషన్తో మాట్లాడి సమస్య తర్వగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం, ఎంపీ బాలశౌరి, నూతన సివిల్ ఏవియేషన్ మినిస్టర్ రామోహన్ నాయుడు కృషి వల్ల విజయవాడ - ముంబై ÷÷-లట్ సర్వీసులు సాకారం అయ్యాయని ఎంపీ కేశినేని చిన్ని (ఓఖ ఐఃబతినిఃనితి అరతినినితి) తెలిపారు. విజయవాడ ఎయిర్పోర్ట్ను ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్గా చేసి ఈస్ట్, వెస్ట్కు కనెక్ట్ అయ్యేలా విజయవాడ ఉండేలా ప్రయత్నం చేస్తామన్నారు. వచ్చేవారం సివిల్ ఏవియేషన్ మినిస్టర్ విజయవాడ వస్తారని చెప్పారు. ఇక్కడ నూతన టెర్మినల్ను 8 నెలల్లో పూర్తి అయ్యేలా చూసేందుకు రివ్యూ నిర్వహిస్తారని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు.

# పుంగనూరులో టిడిపి ఆందోళన

**పర్యటన రద్దు చేసుకున్న మాజీమంత్రి పెద్దిరెడ్డి**

**చిత్తూరు,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ) :**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో కీలక పాత్ర నిర్వహించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఫలితాలు వచ్చిన తర్వాత ఆయన తొలిసారి నియోజకవర్గంలో పర్యటించాలని అనుకున్నారు. ఈ మేరకు అనుచరులు ఏర్పాట్లు చేశారు. శనివారం ఆయన పుంగనూరు రావాల్సి ఉంది. కానీ నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో ఆయన పర్యటనను రద్దు చేసుకున్నారు. పుంగనూరులో పెద్దిరెడ్డి పర్యటనను నిరసిస్తూ టీడీపీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయనకు పదవిలో ఉండే అర్హత లేదని రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కూడలి నుంచి ఇందిర కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మధ్యలో ఓ వైసీపీ నాయకుడి ఇంటిపై రాళ్ల దాడి జరిగింది. తమ ఇంటిపై దాడి చేశారని వైసీపీ నేత ఆరోపిస్తూ ఆస్పత్రిలో చేరారు. ఇలాంటి సమయంలో పెద్దిరెడ్డి నియోజకవర్గానికి వస్తే ఇంకా ఎక్కవ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడతాయన్న ఉద్దేశంతో ఆయన ఆగిపోయినట్లుగా తెలుస్తోంది. నిజానికి పుంగనూరు నియోజకవర్గాన్ని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దుర్భేధ్యంగా మార్చుకున్నారు. ఆయనను కాదని ఎవరూ చిన్న ర్యాలీ కూడా నిర్వహించలేరు. అలా చేస్తే దాడులు జరుగుతాయి. టీడీపీ వాళ్లు అయినా.. బోడె రామచంద్రయాదవ్ కు చెందిన వారు ఎవరైనా సరే .. నియోజకవర్గంలో ఎక్కడా ర్యాలీలు నిర్వహించే పరిస్థితి కూడా ఉండదు. చంద్రబాబు అరెస్టు సమయంలో ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురు టీడీపీ కార్యకర్తలు సైకిల్ పై కుప్పం వెళ్తూంటే.. పుంగనూరులో వాళ్లతో చొక్కాలు విప్పదీయించి.. పంపించారు మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు. అలాంటి ఎంతో మందిపై దాడులు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. అలాంటి చోట పెద్దిరామచంద్రారెడ్డి అధికారం కోల్పోవడంతో ఆయన కూడా పర్యటించలేని పరిస్థితికి వచ్చింది.గతంలో చంద్రబాబు చిత్తూరు పర్యటనకు వెళ్లినప్పుడు మదనపల్లె నియోజకవర్గ పరిధిలోని అంగళ్లు నియోజకవర్గంలో రాళ్ల దాడి జరిగింది. అక్కడి నుంచి పుంగనూరుకు వస్తున్న సమయంలో నగరంలోకి ఎంటర్ కాక ముందే ఆయనపై పెద్ద ఎత్తున దాడికి ప్రయత్నించారు. పోలీసులు కూడా పట్టించుకోక పోవడంతో టీడీపీ కార్యకర్తలు తిరగబడ్డారు. పెద్ద ఎత్తున ఘర్షణలు చోటు చేసుకున్నారు. పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు. ఆ ఘటన తర్వాత వందల మంది టీడీపీ కార్యకర్తల్ని అరెస్టు చేశారు. ఆ కోపం అంతా ఉంటుందని... నియోజకవర్గానికి రాకపోతేనే మంచిదని ఆయనకు పార్టీ నేతలు సూచించినట్లుగా తెలుస్తోంది.

# త్రిసూరులో స్వల్ప భూ ప్రకంపనలు

**తిరువనంతపురం,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

కేరళలోని త్రిసూర్లో శనివారం ఉదయం 8:15 గంటలకు స్వల్పంగా భూమి కింపించింది. 3.0 తీవ్రతతో భూకంపం నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ పేర్కొంది. నాలుగు సెకన్ల పాటు ప్రకంపనలు వచ్చినట్లు త్రిసూర్ జిల్లా అధికారులు తెలిపారు. అయితే, నష్టం లేదా గాయాలకు సంబంధించి ప్రస్తుతానికి రిపోర్టులు లేవు. దేశంలో భూకంప కార్యకలాపాల పర్యవేక్షణ కోసం భారత ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన ఎన్సిఎస్ , భూకంప కేంద్రం అక్షాంశం 10.55 ఔ , రేఖాంశం 76.05 ఇ వద్ద ఏడు కిలోమీటర్ల లోతుతో ఉందని 'ఛీ' వేదికలో పోస్ట్ చేసింది. ఇదిలావుండగా, కున్నంకుళం, ఎరుమపెట్టి, పజాంజీ ప్రాంతాలు, పాలక్కాడ్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర జియాలజీ డిపార్ట్మెంట్ అధికారులు, ఇతరులు సంఘటనపై మరింత అధ్యయనం చేయడానికి ఆ ప్రాంతాలకు వెళ్లారు.

# మోడీ ప్రచారం చేసిన చోటల్లా విజయం

- ప్రజలకు మహావికాస్ అఘాఢి నేతల కృతజ్ఞతలు

**ముంబై,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

మహారాష్ట్రలో ఇటీవల జరిగిన లోక్సభ ఎన్నికల్లో విపక్ష 'మహా వికాస్ అఘాడి' కి మద్దతు తెలిపిన ప్రజలందరికీ కూటమి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఎంవీఏ నేతలు శరద్ పవార్, ఉద్ధవ్ థాకరే, పృధ్వీరాజ్ కపూర్ సంయుక్తంగా శనివారంనాడు మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎక్కడైతే రోడ్షోలు, ర్యాలీలు నిర్వహించారో అక్కడ తాము గెలిచామని ఈ సందర్భంగా శరద్ పవార్ అన్నారు. ఎంవీఏకు అనుకూలంగా రాజకీయ వాతావరణాన్ని మోదీ సృష్టించారని, అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని అన్నారు. లోక్సభ ఎన్నికల్లో భారతీయ జనాతా పార్టీకి, ఎన్డీయేకు గట్టి దెబ్బ తగిలిన మూడు రాష్ట్రాల్లో మహారాష్ట్ర ఒకటి. 2022 జూన్లో శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీల్లో చీలికలు ఏర్పడి, చీలిక గ్రూపులు బీజేపీతో చేతులు కలిపి అధికారంలోకి వచ్చిన అనంతరం మహారాష్ట్రలో జరిగిన తొలి ఎన్నికలు ఇవే కావడం విశేషం. ఈ ఎన్నికల్లో బీజేపీ కేవలం 9 సీట్లు గెలుచుకుంది. 2019లో బీజేపీ 23 సీట్లతో విజయకేతనం ఎగురవేసింది. ఎన్నికల కమిషన్ డాటా ప్రకారం, మోదీ ప్రచారం చేసిన మెజారిటీ సీట్లలో ఎన్డీయే ఈసారి విజయం సాధించడంలో విఫలమైంది. మహారాష్ట్రలోని 18కి పైగా లోక్సభ స్థానాల్లో మోదీ ప్రచారం చేశారు. వాటిలో 15 సీట్లలో ఎన్డీయే ఓటమి చవిచూసింది. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ 'మహా వికాస్ అఘాడి' కలిసే పనిచేస్తుందని శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ థాకరే శనివారంనాడు జరిగిన మీడియా సంయుక్త సమావేశం లో తెలిపారు. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో బాసటగా నిలిచిన సిటిజన్ గ్రూపులు, వివిధ యూట్యూబ్ ఛానెళ్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనను వదిలి వెళ్లిన వారిని తిరిగి పార్టీలోకి తీసుకునేది లేదని కూడా ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత పృధ్వీరాజ్ చవాన్ మాట్లాడుతూ, తమ కూటమిలో ఎక్కువ-తక్కువలు లేవని, ప్రతి అసెంబ్లీ సీటును పరిగణనలోకి తీసుకుని సీట్ల షేరింగ్పై నిర్ణయాలు తీసుకుంటామని, ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిపామని చెప్పారు.

# తుమ్మడిహెట్టి ప్రతిపాదన పక్కన పడేశారు

- పీసీ ఘోష్ కమిషన్ కు రిటైర్డ్ ఇంజినీర్ల నివేదిక
- కాళేశ్వరంపై విచారణ వేగవంతం చేసిన కమిషన్
- పిలిస్తే ఎవరైనా విచారణకు రావాల్సిందేనన్న ఘోష్

**హైదరాబాద్,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించాలన్నది కేసీఆర్ ప్లానేనని రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ కాళేశ్వరం కమిటీకి రిపోర్ట్ ఇచ్చింది. ఈ నివేదికలో కీలక అంశాలను ప్రస్తావించింది. తుమ్మిడిహెట్టి వద్ద తాము ప్రపోజ్ చేసినా వద్దని పక్కన పడేశారని తెలిపింది. రిపోర్ట్ను అప్పటి ఇరిగేషన్ మినిస్టర్, సీఎం కేసీఆర్కు అందించినా సంతకం చేయలేదని ఇంజినీర్లు తెలిపారు. ఈ మేరకు అప్పుడు ప్రపోజ్ చేసిన నివేదికను రిటైర్డ్ ఇంజినీర్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిటీకి అందజేశారు. అనంతరం పీసీ ఘోష్ మీడియాతో చిట్ చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం సబ్ కాంట్రాక్టర్లను గుర్తించే పనిలో ఉన్నామని తెలిపారు. ఆ సంస్థలకు సంబంధించిన డేటాను రిజిస్ట్రార్ ఆఫ్? కంపెనీస్ నుంచి తీసుకుంటామని చెప్పారు. ఆయా కంపెనీల ఖాతాలు, బ్యాంక్ స్టేట్మెంట్స్ పరిశీలిస్తే ఎంత మొత్తం చేతులు మారిందనేది తెలుస్తుందని చెప్పారు. అసిస్టెంట్ డిప్యూటీ ఇంజనీర్లను పిలువాలా.. వద్దా.. అనే అంశంపై కసరత్తు చేస్తున్నట్టు చెప్పారు. విచారణకు పిలిస్తే ఎవరైనా రావాల్సిందేనని పీసీ ఘోష్ అన్నారు. రాకుంటే ఏం చేయాలో తమకు తెలుసునని చెప్పారు. ఈ విషయంలో తనకు అధికారాలున్నాయని అన్నారు. అన్ని అఫిడవిట్లను పరిశీలించిన తర్వాతే సెంట్రల్ వాటర్ కమిషన్ వాళ్లను పిలుస్తామని చెప్పారు. ఏఈఈ, డీఈఈలను విచారించాలా..? వద్దా..? అన్నది తర్వాత ఆలోచిస్తామని చెప్పారు. ప్రస్తుతానికి ఇంజినీర్లతో విచారణ పూర్తయిందన్నారు. వాళ్ల నుంచి అఫిడవిట్లు వచ్చాక ముందుకు వెళ్తామని అన్నారు. మొత్తం 10 నుంచి 15 సబ్ కాంట్రాక్ట్లు ఇచ్చారు. వాటి వివరాలను సేకరించే పనిలో కమిషన్ నిమగ్నమైంది.

# తెలంగాణలో మహిళలను కోటీశ్వర్లు చేసే సంకల్పం

- కాంగ్రెస్ పార్టీ అంటేనే మహిళలకు పెద్దపీట వేస్తుంది
- సెర్ప్ వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేసిన సీతక్క



**హైదరాబాద్,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

తెలంగాణలో మహిళలను కోటీశ్వర్లు చేయాలనేదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మహిళలకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ గ్రామీణాభివృద్ధి సంస్థకు సంబంధించిన ఎస్ హెచ్ జీ బ్యాంకు లింకేజీ 2024-25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేసింది. శనివారం జూబ్లీహిల్స్ లో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఒక మహిళ ఇంట్లో నుంచి బయటికి రావాలంటే ఆంక్షలు విధిస్తారని.. మారుతున్న జీవన ప్రాణాలకు అనుకునంగా మనం కూడా మారాలని చెప్పారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.20 వేల కోట్లు వడ్డీలేని రుణాలను ఇస్తున్నామని తెలిపారు. రూ.10 వేల నుంచి రూ. లక్షలల్లో లోన్స్ తీసుకునే స్థాయికి మహిళలు చేరుకోవాలన్నారు. పొదుపు అనేది భద్రత, బాధ్యత అని చెప్పారు. సాధారణంగా పేదవాళ్లను బ్యాంకర్స్ నమ్మరని.. అలాంటి పేదవాళ్లకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని మంత్రి చెప్పారు. ఫారెస్ట్ ఏరియాలో లాంటి ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లోని మహిళలు ఎక్కువ వెనుకబడి ఉంటారన్నారు. స్థానిక ప్రాంతాల్లో ఉండే.. అవసరాలకు అనుగుణంగా వ్యాపారం చేయాలని చెప్పారు మంత్రి. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్ లో సోలార్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ఎ÷-లాన్ చేస్తుందని సీతక్క తెలిపారు. 50 నుంచి 70 రూపాయలకు స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ ధరలు పెంచి రూ.50 కోట్లు మహిళలకు ఇచ్చామని చెప్పారు. పేదరిక నిర్మూలన కోసం.. పేదలకు ఏం చేస్తే మేలు జరుగుతదో బ్యాంకర్స్ ఆలోచించాలని ఆమె సూచించారు. మహిళలను ముందుకు తీసుకురావాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని చెప్పారు. బ్యాంకర్స్, ప్రభుత్వం ఇద్దరు సాయం చేస్తేనే పేదరిక నిర్మూలన జరిగుతుందని మంత్రి సీతక్క అన్నారు.

# బిజెపిలో విలీనం కానున్న బిఆర్ఎస్

- పురోగతిలో చర్చలు ..త్వరలోనే ప్రక్రియ పూర్తి
- మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

**సూర్యాపేట,జూన్15(పీపుల్స్ మోటివేషన్ ):**

బీజేపీలో బీఆర్ఎస్ పార్టీని విలీనం చేసేందుకు చర్చలు జరుగు తున్నాయని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరోలనే బిజెపిలో బిఆర్ఎస్ విలీనం కావడం ఖాయమని అన్నారు. శనివారం నూతనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కేసీఆర్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. సంతోష్ రావు, వినోద్ కుమార్, నమస్తే తెలంగాణ ఎండీ దామోదర్, కేటీఆర్ లు కలిసి.. బీఆర్ఎస్ పార్టీని విలీనం చేయడానికి బీజేపీ అధిష్టానంతో చర్చలు జరుపుతున్నారని అన్నారు. ఎల్ నర్సింహారెడ్డి విచారణ కమిటీని కేసీఆర్ రద్దు చేయడం అనడం విడ్డూరమన్నారు. యాదాద్రి, ఛత్తీస్గఢ్ విద్యుత్ కొనుగోళ్లలో కేసీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. త్వరలో ఆధారాలతో సహా నిరూపిస్తామని ఆయన చెప్పారు. కేసీఆర్ హయాంలో గొర్రెల స్కామ్ లో కూడా రూ.7 వందల కోట్ల స్కాం జరిగిందన్నారాయన. దీనిపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ విచారణ చేపట్టిందని తెలిపారు. ఢిల్లీలో రూ.11 వందల కోట్ల లిక్కర్ స్కామ్ చేసి.. కవిత జైల్లో ఊచల లెక్కబెడుతోందన్నారు. ఫోన్ ట్యాపింగ్ లో ప్రభాకర్ రావుతో సహా అందరూ జైలుకు వెళ్తారని మంత్రి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేస్తే ఏడేళ్ల వరకు బెయిలు రాదన్నారు. అందుకే అమెరికా నుంచి ప్రభాకర్ రావును రానివ్వడం లేదని అన్నారు. రాష్ట్రంలో పదేళ్లు కేసీఆర్.. ప్రజలను మోసం చేసి లక్షల కోట్ల రూపాయలను దోచుకున్నారని మంత్రి కోమటిరెడ్డి విమర్శించారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# కొత్తదనం లేని కథ..కథనంలో బోర్

**కాపీ సినిమాలో హరోం హర మూవీ**

సుబ్రహ్మణ్యం (సుధీర్ బాబు) ఒక పోలీటెక్నిక్ కాలేజ్ లో ల్యాబ్ అసిస్టెంట్ గా పని చేస్తూ ఉంటాడు. కుప్పం వూర్లో తమ్మిరెడ్డి (లక్కీ లక్ష్మణ్), అతని సోదరుడు (రవి కాలే), ఇంకా శరత్ (అర్జున్ గౌడ) తమ బలగంతో ప్రజల భూములు కాజేసి, తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వుంటారు. అడ్డువచ్చిన వాళ్ళని నరుకుతూ తమకి ఎదురులేదు అనే విధంగా వుంటారు. ఒకరోజు తమ్మిరెడ్డి మనుషులు ఒక యువకుడిని వెంటాడుతూ చంపడానికి ప్రయత్నం చేస్తూ ఉంటే సుబ్రహ్మణ్యం అడ్డుపడతాడు, తన వుద్యోగం పోగొట్టుకుంటాడు. అదే కాలేజ్ లో పని చేస్తున్న టీచర్ (మాళవిక శర్మ) తో ప్రేమలో ఉంటాడు సుబ్రహ్మణ్యం. తన తండ్రి చేసిన అప్పులు తీర్చటం కోసం డబ్బులు గడించాలని, సస్పెండ్ అయిన పోలీసు కానిస్టేబుల్ పళని (సునీల్) తో చేతులు కలిపి ఖాళీగా వున్న ఒక సినిమా థియేటర్ లో గన్స్ తయారు చేసి అవి దొంగచాటుగా అమ్మడం మొదలుపెడతాడు. తన తండ్రిని తమ్మిరెడ్డి మనుషులు కట్టి తీసుకువచ్చి చంపటానికి ప్రయత్నం చేస్తుంటే, సుబ్రహ్మణ్యం వాళ్ళని అడ్డుకుంటాడు, తండ్రిని కాపాడుకుంటాడు. సుబ్రహ్మణ్యం పేరు కుప్పంలో మారుమోగుతోంది, ప్రజలు అతన్ని దేవుడిగా చూస్తూ వుంటారు. రెడ్డి మనుషులు ఎందుకు తన తండ్రిని చంపాలని అనుకుంటారు? దొంగతనంగా గన్స్ ఎక్కడ నుండి తయారవుతున్నాయో తెలుసుకోవడానికి వచ్చిన స్పెషల్ పోలీసు ఆఫీసరు (అక్షర గౌడ) ఏమి కనుక్కుంది? రెడ్డి సోదరులకు, సుధీర్ బాబు కి మధ్య యుద్ధం ఎలా, ఎప్పుడు మొదలయిందనేదే 'హరోం హర' సినిమా స్టోరీ. దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో వచ్చిన ఈ 'హరోం హర' అల్లు అర్జున్ నటించిన 'పుష్ప' సినిమాకి దగ్గరగా ఉంటుంది. అందులో గంధంచెక్కల దొంగతనంగా అమ్ముతూ, డబ్బులు గడిస్తూ పుష్ప పెద్దవాడైతే, ఇందులో గన్స్ తయారుచేస్తూ వాటిని దొంగతనంగా అమ్ముతూ పెద్దవాడవుతాడు సుబ్రహ్మణ్యం. ఆ సినిమా కూడా చిత్తూరు, తిరుపతి నేపథ్యం అయితే, ఈ సినిమా చిత్తూరు జిల్లాలో కుప్పం నేపథ్యంలో వచ్చిన సినిమా. దానికితోడు గన్స్ తయారుచేస్తూ, దొంగతనంగా అమ్ముతూ, అడ్డువచ్చిన విలన్స్ చంపుకుంటూ పోయే సుబ్రమణ్యాన్ని దేవుడుగా చిత్రీకరిస్తాడు దర్శకుడు. అలాగే సుబ్రహ్మణ్యం తను కాబోయే భార్యకి గన్స్ అమ్మి డబ్బు గడిస్తున్నాను అంటే అది ఆమె సమర్థించటమే కాకుండా, అది చాల మంచిది అన్నట్టుగా చెప్పించాడు దర్శకుడు. 'కేజీఎఫ్' సినిమా కూడా దర్శకుడిపై బాగా ప్రభావం చూపించినట్టుంది, అందుకని ఆ సినిమా ఛాయలు కూడా ఈ 'హరోం హర' లో కనిపిస్తాయి. 'హరోం హర' సినిమా మొదలవడం ఆసక్తికరంగానే సాగుతుంది, కానీ తరువాత కొన్ని సాగదీత సన్నివేశాలతో నింపేసాడు దర్శకుడు. విలన్ మనుషులతో సుధీర్ బాబు తలపడే సన్నివేశం నుండి కథ కొంచెం వేగం పుంజుకుంటుంది. అయితే దర్శకుడు మొదటి సగం వరకు సినిమాని బాగానే చూపించగలిగాడు. కానీ రెండో సగంలో కథ ఏమి చెయ్యాలో తెలియక, ఎక్కువగా పోరాట సన్నివేశాలపై దృష్టి మరల్చాడు. అలాగే కొన్ని సన్నివేశాలు సాగదీసాడు కూడా. చేతిలో పదిరూపాయలు కూడా లేని కథానాయకుడు ఒక్కసారిగా ధనవంతుడు అవటం అనేది ఎన్ని సినిమాల్లో చూడలేదు మనం ఇప్పటివరకు. అందుకని దర్శకుడు ఇందులో కొత్త పాయింట్ ఏమీ చెప్పలేదు, అదే కథలని తిప్పి తిప్పి తీసాడు, కొంచెం కుప్పం యాస పెట్టాడు అంతే. దర్శకుడు కేవలం సుధీర్ బాబుని ఒక మాస్ అవతార్ లో చూపించాలని ఈ కథని రాసినట్టుగా కనపడుతోంది. ఈ సినిమాలో హింస మరీ ఎక్కువయింది, తలలు నరకటం, మొండాలు చూపించడం తగ్గిస్తే బాగుండేది. ఇప్పుడు చాలా సినిమాల్లో అదొక ఫ్యాషన్ అయిపొయింది.ఇక నటీనటుల విషయానికి వస్తే సుధీర్ బాబు ఒక మాస్ అవతార్ లో కనపడతారు, అతని బాడీ, అతని ఫిజిక్ చూపించడానికి ఈ సినిమా ఉపయోగపడింది. పోరాట సన్నివేశాల్లో బాగున్నారు, అతని పాత్రని సంఘర్షణలతో కూడి బలంగా రాసి ఉంటే బాగుండేది. కథలో కొత్తదనం లేదు, ఏమి జరుగుతుందో ముందే ఊహించుకోవచ్చు.







# హాట్ కేకుల్లా కల్కి మూవీ టిక్కెట్స్

**ప్రీ సేల్స్ లో 'ఆర్ఆర్ఆర్' రికార్డులు బ్రేక్**

నాగ్ అశ్విన్-ప్రభాస్‌ల కాంబోలో రానున్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'కల్కి 2898 ఏడీ' జూన్ 27న విడుదల కానుంది. దీని కోసం సినీ ప్రియులంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. 'కల్కి' రిలీజ్‌కు ముందే రికార్డులను బ్రేక్ చేస్తోంది. తాజాగా ఓవర్సీస్‌లో దీని ప్రీ బుకింగ్స్ ఓపెన్ చేయగా టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. ప్రీ సేల్స్ విషయంలో 'ఆర్ఆర్ఆర్' రికార్డులను బ్రేక్ చేసింది. అమెరికాలో ఇప్పటికే మిలియన్ డాలర్ల ప్రీ సేల్ బిజినెస్ జరిగింది. ప్రీ బుకింగ్స్‌లో అత్యంత వేగంగా మిలియన్ డాలర్ల మార్కును అందుకున్న ఇండియన్ సినిమాగా రికార్డు సృష్టించింది. ఇదే తరహాలో బుకింగ్స్ కొనసాగితే విడుదలకు ముందే రెండు మిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఆస్ట్రేలియాలో ఇప్పటి వరకు 9 లొకేషన్లలో ప్రీ బుకింగ్స్ ఓపెన్ చేయగా అక్కడ కూడా టికెట్స్ భారీగా అమ్ముడవుతు న్నాయి. విదేశాల్లో ఎక్కువ ఐమ్యాక్స్‌ల్లో విడుదల కానున్న చిత్రంగా కల్కి మరో రికార్డును సొంతం చేసుకుంది. జూన్ 26న ఈ చిత్రం అక్కడ రిలీజ్ కానుంది. ఏకంగా 90 కంటే ఎక్కువ ఐమ్యాక్స్‌ల్లో దీన్ని ప్రదర్శించనున్నారు. ఇప్పటి వరకు ఏ భారతీయ చిత్రం ఇన్ని ఐమ్యాక్స్ థియేటర్లలో విడుదల కాలేదు. రిలీజ్‌కు ఇంకా సమయం ఉండడంతో ఈ సంఖ్యను మరింత పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ఈ చిత్రంలో ఒక్క పాటే ఉంటుందని ఇటీవల కొన్ని వార్తలు వచ్చాయి. తాజాగా మరో పాటను జోడిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సినిమా విడుదలకు ముందే ఆ పాటను రిలీజ్ చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల అమితాబ్ కూడా తన బ్లాగ్‌లో పోస్ట్ పెడుతూ.. 'త్వరలో విడుదల కానున్న సినిమాలోని పాట చిత్రీకరణలో బిజీగా ఉన్నాను' అని తెలిపారు. దీంతో అది 'కల్కి'లోని పాటే అని కొందరు భావిస్తున్నారు. ఈ పాటను ప్రముఖ బాలీవుడ్ సింగర్ అర్జీత్ సింగ్ పాడినట్లు తెలుస్తోంది.పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం తెరకెక్కింది. తాజాగా దీని ప్రచారం జోరు పెంచారు. వినూత్న రీతిలో ప్రమోషన్ మొదలు పెట్టారు. 'కల్కి' అని పేరు రాసున్న ప్రచార వాహనాలు రోడ్లపై కనిపిస్తున్నాయి. గతంలోనూ ఫ్యాన్స్ కార్ ర్యాలీ నిర్వహించిన సంగతి తెలిసిందే. కార్లను 'ప్రాజెక్ట్- కె' (కల్కి వర్కింగ్ టైటిల్) లోగో రూపంలో పార్క్ చేసి ఇదే పేరుతో ఉన్న ప్రత్యేక టీ షర్ట్ ధరించి సందడి చేశారు. జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను అమరావతిలో ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. భారీగా దీన్ని నిర్వహించనున్నట్లు టాక్. సినీ, రాజకీయ ప్రముఖులను అతిథులుగా ఆహ్వానించాలని చిత్రబృందం భావిస్తుంది. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని కొన్ని పోస్టలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రభాస్  సరసన దీపిక పదుకొణె నటిస్తుండగా.. సీనియర్ హీరో కమల్ హాసన్  విలన్ పాత్ర పోషిస్తున్నారు. అలాగే అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా నటించారు. పశు పతి, రాజేంద్రప్రసాద్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## పుష్ప-2 షూటింగ్‌లో..

# తగ్గిన వేగం





**విడుదల ఆలస్యం తప్పదన్న టాక్**

ఐకాన్ స్టార్ గా అభిమానులు పిలుచుకునే అల్లు అర్జున్ 'పుష్ప 2' చిత్రీకరణలో బిజీగా వున్నారు. దర్శకుడు సుకుమార్ కూడా చిత్రాన్ని త్వరగా పూర్తి చేసే పనిలో ఉన్నారు. అయితే  'పుష్ప 2' సినిమా ఆగస్టు 15న విడుదలవుతుంది అని ఇప్పటివరకు ఘంటాపథంగా చెప్పుకువస్తున్న చిత్ర నిర్వాహకులు ఇప్పుడు ఆ సినిమా ఆ తేదీకి రావటం లేదని అంటున్నట్టుగా పరిశ్రమలో ఒక టాక్ నడుస్తోంది. ఇంకా చిత్రీకరణ చెయ్యాల్సిన సన్నివేశాలు చాలా ఉన్నాయని, అవి కాకుండా పోస్ట్ ప్రొడక్షన్ పని కోసం సుకుమార్ చాలా సమయం అడిగారని కూడా తెలుస్తోంది. అయితే చిత్ర నిర్మాతలు సుకుమార్ పై చాలా ఒత్తిడి తెచ్చి ఎలా అయినా ఆగస్ట్ 15న విడుదల చేయించాలని విశ్వ ప్రయత్నాలు చేసినట్టుగా కూడా తెలుస్తోంది. అయితే ఒత్తిడితో పని చెయ్యడం చాలా కష్టమని, తనకి తగినంత సమయం ఇవ్వాలని, అందుకని ఆగస్టు 15వ తేదీకి సినిమా రావటం కూడా కష్టమని దర్శకుడు నిర్మాతలతో చెప్పినట్టుగా వార్తలు పరిశ్రమలో నడుస్తున్నాయి. ఇప్పుడు చిత్ర నిర్మాతలు కొత్త తేదీ కోసం వెతుకులాట ప్రారంభించారని కూడా తెలిసింది. అయితే దగ్గరలో వాళ్ళకి ఎటువంటి తేదీలు కనపడలేదని, ఎందుకంటే వేరే పెద్ద సినిమాలు ఆ సమయంలో విడుదలకు ఉన్నాయని, అందువలన ఏకంగా డిసెంబర్ నెలలో విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేసుకుంటున్నటుగా తెలిసింది. ఒకవేళ 'పుష్ప 2' డిసెంబర్ నెలలో విడుదలైతే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంటుందా అని కూడా చిత్ర నిర్వాహకులు ఆలోచిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఏమైనా కూడా 'పుష్ప 2' విడుదల వాయిదా పడటం మాత్రం ఖాయం అని పరిశ్రమలో అంటున్నారు. అందువలనే ఎన్టీఆర్, శివ కొరటాల కాంబినేషన్ లో వస్తున్న 'దేవర' విడుదల ముందుకు జరిపినట్టుగా తెలుస్తోంది. ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు, రష్మిక మందన్న ఇందులో కథానాయికగా నటిస్తోంది.




# మిస్టర్ బచ్చన్ క్రేజీ అప్‌డేట్



టాలీవుడ్ మాస్ మహరాజా రవితేజ, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి లాంఛ్ చేసిన టైటిల్ పోస్టర్‌లో రవితేజ తన ఫేవరేట్ లెజెండరీ యాక్టర్ అమితాబ్ పోజ్‌లో కనిపిస్తూ మూవీ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తున్నాడు. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా షూటింగ్ సంబంధించి సాలిడ్ అప్‌డేట్ వచ్చింది. తాజాగా మూవీ కంప్లీట్ అయినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా దర్శకుడు హరీశ్ శంకర్ ఒక ప్రమోషనల్ వీడియో విడుదల చేశాడు. ఈ వీడియోలో రవితేజ అభిమాని వచ్చి హరీశ్ శంకర్‌ను నేను రవితేజ డై హార్డ్ ఫ్యాన్ అన్న అంటాడు. ఆ తర్వాత మూవీ నుంచి ఎదైనా అప్‌డేట్ ఇవ్వమని కోరతాడు. దీనికి హరీశ్ శంకర్ మాట్లాడుతూ.. షూటింగ్ అయిపోయింది. ఇక అప్‌డేట్‌లే మిగిలి ఉన్నాయి. గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌లు అవి అందరు ఇచ్చేవే మనం ఈసారి కొత్తగా ప్లాన్ చేద్దాం. ఈసారి ఒక షో రీల్ వదులుదాం. అందులో డైలాగ్స్ ఉండవు అంటూ హరీశ్ శంకర్ తెలిపాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. షాక్, మిరపకాయ్ సినిమా తర్వాత రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో ఈ సినిమా వస్తుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. రవితేజ ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్ అభిమానిగా కనిపించనున్నాడు.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com